ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
ఆదివారం 26-07-2026 పేజీలు : 16

## అన్నారం దర్గాలో భారీ కుంభకోణం

- అవినీతి అక్రమార్కుడికే మళ్లీ తలనీలాల టెండర్!
- రెండు సంవత్సరాల క్రితం రూ. 60 లక్షల విలువైన తలనీలాలు మాయం..
- కలెక్టర్, వక్ఫ్ బోర్డు విచారణ నివేదికలను బేకాతర్ చేసిన అధికారులు..
- బహిరంగ వేలం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా మూడేళ్ల టెండర్ కరారు..
- ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పందించాలని ప్రజల డిమాండ్...

11లో...

వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై25(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజరత్ యాకూబ్ షా వలి బాబా దర్గాలో భారీ అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి.

# చట్ట సభల్లోకి జెన్ జీ

- 21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభ, 25 ఏళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ
- జెన్ జీకి అవకాశం కల్పించాలంటూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం
- లోక్‌సభలో 1 శాతం కంటే తక్కువగా జెన్ జీ ప్రాతినిధ్యం
- రాహుల్ మంత్రివర్గంలో జెన్ జీకే విద్యా శాఖ
- జెన్ జీ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

హైదరాబాద్: అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమెదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.



14 పేజీలో...



## మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఆశాడి ఉత్సవాల ఆహ్వానం

-బావనంద పూర్ సర్పంచ్ నరిగే సత్తమ్మ రమేష్

2 పేజీలో...

## ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

12 పేజీలో...

## ఊరూరా విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమాలను చేపట్టాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

నిజామాబాద్, జూలై 25 :( విజన్ ఆంధ్ర) ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు.

6 పేజీలో...

## NEET వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- "యువత భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకున్నాను"..
- ప్రధానికి లేఖ పంపిన కేంద్ర మంత్రి...



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 25 (విజన్ ఆంధ్ర) న్యూఢిల్లీ: NEET-UG పరీక్షలో తలెత్తిన అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యారంగానికి సేవ చేస్తున్నానని, బలమైన విద్యా వ్యవస్థే దేశానికి పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని లేఖలో పేర్కొన్నారు. దేశ యువత ఆకాంక్షలను, వారి న్యాయమైన అంచనాలను తాను ఎంతో గౌరవిస్తానని, భారత యువత కలలను సాకారం చేయడం తమందరి నైతిక బాధ్యత అని అన్నారు.

16 పేజీలో...



# మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు ఆశాడి ఉత్సవాల ఆహ్వానం

**-బావనంద పూర్ సర్పంచ్ నరిగే సత్తమ్మ రమేష్**

మర్కుక్ జూలై 25,( విజన్ ఆంధ్ర ): తెలంగాణ పండరీపురంగా పేరుగాంచిన పాండురంగ ఆశ్రమంలో చారిత్రక ఆశాడి ఉత్సవాలు 25,26 న జరుగుతున్న సందర్భంగా భక్తోత్సవముగా జరిగే ఆషాడి ఉత్సవాలకు విచ్చేయాలని శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ని ఎర్రవల్లి లో గల కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో భావానందపూర్ గ్రామ సర్పంచ్ నరిగే సత్తెమ్మ రమేష్ మర్యాదపూర్వకంగా కలసి పాండురంగాశ్రమ ఉత్సవ ఆహ్వాన పత్రిక ను అందజేశారు.వారోతో పాటు అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి,గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్,బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

# తలకొండపల్లి లో ఏకలవ్యుని ఘనంగా జయంతి వేడుకలు...

తలకొండపల్లి జులై 25, (విజన్ ఆంధ్ర ):తలకొండపల్లి మండల కేంద్రంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకను జరుపుకోవడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ గ్రామ సర్పంచ్ కటికల శేకర్ యాదవ్ మాట్లాడుతూ... గురుభక్తి. క్రమశిక్షణ. త్యాగము. వినయము. కలిగినటువంటి మహా మహా గొప్పవాళ్లలో ఏకలవ్యుడు అని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ జ్యోతయ్య మరియు గ్రామ ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్, మరియు తలకొండపల్లి వార్డు మెంబర్స్ మరియు గ్రామ యువకులు ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొని ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది



# దేశద్రోహులను సమర్థించే కాంగ్రెస్ వైఖరిని ప్రజలు క్షమించరు

**- మర్పల్లిలో బీజేపీ నిరసన.. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై**

**మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి విమర్శలు**



మర్పల్లి, జులై 25(విజన్ ఆంధ్ర): దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పార్టీ పరోక్షంగా మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ మర్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మర్పల్లి మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని విమర్శించారు.దేశ సమగ్రత, జాతీయ భద్రతకు విఘాతం కలిగించే శక్తులను కాంగ్రెస్ పార్టీ పదేపదే సమర్థించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. దేశద్రోహ భావజాలాన్ని ప్రోత్సహించే వారిపై బీజేపీ ఎప్పటికీ రాజీ పడదని స్పష్టం చేశారు.జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష నీట్ విషయంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తోందని రామేశ్వర్ రెడ్డి విమర్శించారు. నీట్ పరీక్షను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. పేపర్ లీక్ అంశాన్ని అడ్డుపెట్టుకుని దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆయన విమర్శించారు. దేశ సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణ విషయంలో భారతీయ జనతా పార్టీ ఎలాంటి రాజీ పడదని, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్ కుమార్, నాయకులు లక్ష్మన్, బలరాం గౌడ్, జైపాల్, మల్లేష్, మధు, గణేష్, రమేష్, సంగమేశ్వర్, శేఖర్, నాగేష్, రవీందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, మాణిక్యం, భద్రన్న, బలవత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు కీలక సూచనలు

**- పట్లూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు**


**- 50 శాతం వర్షపాతం లోటు: శాస్త్రవేత్తల హెచ్చరిక**




మర్పల్లి, జూలై 25 (విజన్ ఆంధ్ర): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పట్లూర్ రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. రాజేశ్వర్ రెడ్డి , మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది మండలంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 50 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో రైతులు పంటల ఎంపిక నుంచి నీటి వినియోగం వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సదస్సులో రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని వివరించారు. ఈ పరిస్థితుల్లో తక్కువ కాల వ్యవధిలో పండే, తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయడం మంచిదన్నారు. అలాగే నేల తేమను సంరక్షించడం, సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని సూచించారు.పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పంటల్లో ఆశించే ప్రధాన చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు, సమగ్ర చీడపీడల యాజమాన్యంపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.మండల వ్యవసాయ అధికారి కె. శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలను రైతులు అనుసరించాలని కోరారు. కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు నానో డీఏపీ వినియోగం, దాని ప్రయోజనాలు, పంటల్లో సరైన వినియోగ విధానాన్ని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సంగీత, పట్లూర్ సర్పంచ్ పరుశురాం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, ఉపసర్పంచ్, రాంపూర్ సర్పంచ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సిపిఐ నేతలు

- కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ జరిపించాలి.
- సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ డిమాండ్.
- స్థూపం సీలింగ్ భూముల్లోఅక్రమ నిర్మాణాలనువెంటనే తొలగించాలి.
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ డిమాండ్



అక్కన్నపేట జూలై 25 విజన్ ఆంధ్ర : హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని 1189/దీ సర్వే నెంబర్8 ఎకరాల భూమిని 1973 లో సీలింగ్ భూములను పట్టేదార్ ముత్తినేని రాంచంద్రరెడ్డి ప్రభుత్వానికి అప్పగించిన తర్వాత పల్లెల్లో దొపిడి దొరలు భూస్వాముల ఆగడాలకు అనునిత్యం బలైపోతున్న పేద ప్రజలకు కమ్యూనిస్టులుగా వారి పక్షాన నిలబడి న్యాయం చేస్తు ప్రజా పోరాటంలో పాలక ప్రభుత్వాల వల్ల అసువులు బాసిన 88 మంది అమరవీరుల స్మృతి చిహ్నంగా 1990లో ఫిపుల్ వార్ ఆసియా ఖండంలో రెండో 88 అడుగుల ఎతైన స్థూపాన్ని నిర్మించారని సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాడు సిపిఐ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి ఎట పి.రాజు కుమార్ ద్వారా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చినట్లు జాగీర్ సత్యనారాయణ తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ అమరవీరుల స్థూపం నిర్మాణం అప్పటి నుండి 3 దశాబ్దాలకు పైగా అట్టి భూమి వైపు ఎవరు కన్నెత్తి కూడా చూడ లేదని 2013 లొ భూముల సవరణల సందర్భంగా ఆనాడు సీలింగ్ భూమి కింద ప్రభుత్వానికి అప్పగించిన ముత్తినేని రాంచంద్రరెడ్డి వారసులు ముత్తినేని రాజేశ్వర్ రెడ్డి రెవెన్యూ, భూమి కొలతల అధికారులతొ కుమ్మక్కై సీలింగ్ భూమిని యదావిధిగా పట్టా భూమిగా మార్పిడి చేయించుకోని అక్రమంగా పట్టేదార్ పాస్ బుక్ లు పొంది అట్టి భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి స్థానిక ప్రజా ప్రతి నిధుల అండ దండలతో పురపాలక సంఘం అధికారుల సహకారంతో వెంచర్ ఏర్పాటు చేసి లక్షలు కొట్లు గడిస్తున్నారని వెంటనే అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని జాగీర్ సత్యనారాయణ గడిపె మల్లేశ్ జిల్లా కలెక్టర్ ను కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య, నంగి కనకయ్య, ఏగుర్ల కిష్టయ్య, గుడేపు సుదర్శన్, సిద్దిరాం భద్రయ్య, సిపిఐ గుడెపు సంతోష నాయకులు దండుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రింగ్ రోడ్ సెంటర్ అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ "జూపల్లి రమేష్"



అశ్వరావుపేట:విజన్ ఆంధ్రా 26 జులై : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో జరుగుతున్న వాటర్ పైప్‌లైన్ పనుల నాణ్యతను, పనుల పురోగతిని అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ శనివారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే రింగ్ రోడ్ సెంటర్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా రింగ్ రోడ్ సెంటర్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యతా ప్రమాణాలతో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మండల కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, మిండా హరిబాబు, నక్క సత్యనారాయణ, బూసి పాండురంగ, అల్లాడి వెంకట రామారావు, కర్నాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# SIR ఓటు నమోదు కార్యక్రమం పురోగతిపై తహసీల్దార్‌తో సమీక్ష

## - మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్



26జులై విజన్ ఆంధ్రా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అశ్వరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై తహసీల్దార్ డి. కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డి. కిషోర్ మాట్లాడుతూ, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో ---= ఓటరు నమోదు కార్యక్రమం దాదాపు 86 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, అశ్వరావుపేట మండల దిశా ఇంచార్జ్ చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, నక్క సత్యనారాయణ, అశ్వరావుపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంద్రు రమేష్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సార్ ప్రక్రియలో 76.68 శాతం పూర్తి

## - అపోహలు నమ్మొద్దు.. ప్రతి ఓటు భద్రంగానే ఉంటుంది: తహసీల్దార్ మనోహర చక్రవర్తి



మర్పల్లి, జూలై 25 (విజన్ ఆంధ్ర): మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సార్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు 76.68 శాతం పూర్తి అయినట్లు తహసీల్దార్ మనోహర చక్రవర్తి తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో విజన్ ఆంధ్ర రిపోర్టర్ వెంకటేశం తో మాట్లాడుతూ మండలంలో గతంలో 45,891 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 35,187 మంది తమ సార్ ఫారాలను సమర్పించినట్లు వెల్లడించారు.ఇంకా సార్ ఫారం అందని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే తమ పరిధిలోని బీఎల్‌వోను సంప్రదించి ఫారం తీసుకుని నింపి ఇవ్వాలని, లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫారం పొందవచ్చని సూచించారు. చనిపోయిన ఓటర్లకు సంబంధించి కుటుంబ సభ్యుల నుంచి డిక్లరేషన్ తీసుకుని వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు.ఒక వ్యక్తికి రెండు చోట్ల సార్ ఫారాలు వచ్చినా, ఒకే చోట మాత్రమే ఫారం నింపి సమర్పించాలని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉండదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలు ప్రతిరోజూ సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సార్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, మీ ఓటు పూర్తిగా భద్రంగానే ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. ఓటర్లకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ సిద్ధంగా ఉందని, ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మండలంలోని ప్రతి అర్హ ఓటరు సార్ ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# లక్షల్లో ఆదాయం... సౌకర్యాలు ఏవి..?

## - నెలకు రూ.10 లక్షల ఆదాయం.. షాద్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులే కరువు
## - తాగునీరు లేదు.. టాయిలెట్లు అధ్వాన్నం.. వెయిటింగ్ హాల్‌లో కుర్చీలు కరువు
## - ఆదాయం వస్తున్నా అభివృద్ధి ఎందుకు పట్టడం లేదు..? ప్రయాణికుల ప్రశ్న

షాద్‌నగర్, విజన్ ఆంధ్ర (జూలై 25) : ఒక పట్టణ అభివృద్ధికి బస్టాండ్ ముఖద్వారంలాంటిది. ఆ పట్టణానికి వచ్చే వారి తొలి అభిప్రాయం బస్టాండ్‌ను చూసే ఏర్పడుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి అద్దెల రూపంలో ప్రతి నెలా సుమారు రూ.10 లక్షల ఆదాయం సమకూరుస్తున్న షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ మాత్రం ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితిలో ఉండటం విమర్శలకు దారితీస్తోంది. లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం అడుగుపెట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్ బస్టాండ్ పరిధిలోని దుకాణాల అద్దెలు, వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ ఫీజులు, ప్రకటనల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ప్రతి నెలా గణనీయమైన ఆదాయం సమకూరుతోంది. అయితే ఆ ఆదాయంలో కొంత భాగమైనా బస్టాండ్ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో పరిస్థితులు చూస్తే ఆదాయం--అభివృద్ధి మధ్య భారీ అంతరం కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు.

### వేలాది మంది ప్రయాణికులకు ప్రధాన కేంద్రం

హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న షాద్‌నగర్ బస్టాండ్‌కు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, కేశంపేట, ఫరూఖ్‌నగర్, నందిగామ, కొత్తూరు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ఇది కీలక కేంద్రం. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బస్టాండ్ రద్దీగా కనిపించినా, ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు మాత్రం అందుబాటులో లేవు.

### తాగునీటి కోసం అవస్థలు

ప్రభుత్వ బస్టాండ్‌లో ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. నీటి కోసం బయట దుకాణాల్లో బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని, పేద ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఎండాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని అంటున్నారు.

### టాయిలెట్లు ఉన్నా ఉపయోగించలేని పరిస్థితి

బస్టాండ్‌లోని మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో అధ్వాన్నంగా మారాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పరిశుభ్రత లేకపోవడం, తగిన నీటి సౌకర్యం లేకపోవడం, దుర్వాసన వెదజల్లడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆధునిక బస్టాండ్‌కు తగిన ప్రమాణాలు ఇక్కడ కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

### వెయిటింగ్ హాల్‌లో వేచి ఉండడమే శిక్ష

బస్సులు ఆలస్యమైనప్పుడు ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అయితే వెయిటింగ్ హాల్‌లో సరిపడా కుర్చీలు లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, చిన్నారులతో వచ్చిన కుటుంబాలు నిల్చునే పరిస్థితి నెలకొంది. కొందరు నేలపై కూర్చొని బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పరిశుభ్రత, లైటింగ్‌పైనా అసంతృప్తి

బస్టాండ్ ప్రాంగణంలో చెత్త తొలగింపు, పరిశుభ్రత, లైటింగ్, ఫ్యాన్లు, ప్రయాణికుల సమాచార బోర్డులు వంటి సౌకర్యాలు కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతమైనప్పటికీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి కనిపించడం లేదని అంటున్నారు.

### ఆదాయం వస్తోంది... అభివృద్ధి ఎందుకు లేదు?

ప్రతి నెలా సుమారు రూ.10 లక్షల ఆదాయం సమకూరుతున్న బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం పట్ల ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఆదాయం ఎక్కడికి వెళ్తోంది? బస్టాండ్ అభివృద్ధికి ఎందుకు కేటాయించడం లేదు? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ సంస్థలు ఆదాయ సేకరణతో పాటు ప్రయాణికుల సౌకర్యాలపై కూడా సమానంగా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

### ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలి

శాశ్వతంగా స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి,మరుగుదొడ్లను ఆధునికీకరించి పరిశుభ్రంగా నిర్వహించాలి,వెయిటింగ్ హాల్‌లో తగిన సంఖ్యలో కుర్చీలు ఏర్పాటు చేయాలి,పరిశుభ్రత, లైటింగ్, ఫ్యాన్లు, సమాచార బోర్డులు మెరుగుపరచాలి,బస్టాండ్‌కు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని స్థానిక అభివృద్ధికి కేటాయించాలి, కార్గో సేవలు సరైన సమయం కేటాయించాలి.షాద్‌నగర్ బస్టాండ్‌కు వచ్చే ఆదాయం, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దీనిని ఆధునిక బస్టాండ్‌గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆదాయం--అభివృద్ధి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి, ప్రయాణికులకు అవసరమైన కనీస వసతులను అత్యవసరంగా కల్పిస్తేనే ప్రభుత్వ సేవలపై ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా, సౌకర్యాల లేమితో షాద్‌నగర్ బస్టాండ్ ప్రయాణికుల అసంతృప్తికి కేంద్రంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# విట్టలేశ్వర ఆలయాలను దర్శించుకున్న అర్బన్ ఎంఎల్ఏ

నిజామాబాద్ జులై25:( విజన్ ఆంధ్ర) : ఆషాఢశుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పురస్కరించుకుని నగరంలోని నాందేవ్ వాడ, బ్రహ్మపురి లో గల విఠలేశ్వర ఆలయాలను శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహావిష్ణువు రూపం విట్టలేశ్వరుడు అన్నారు. ఏకాదశి నుంచి మహావిష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు చెబుతున్నాయన్నారు. హిందూ సాంప్రదాయంలో తొలి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఉపవాసం చేసి మహావిష్ణువును ఆరాధిస్తే పాపాలు తొలిగి, ఆయురారోగ్యం, అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసం అన్నారు. మహారాష్ట్ర లో విఠలేశ్వరుడు, రుక్మిణి దేవి ను అత్యధికంగా కొలుస్తారని, ఇందూరులోనూ మహారాష్ట్ర సాంప్రదాయం పాటిస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# భూపాలపల్లి జిల్లా జడ్జి ఆకస్మిక తనిఖీలు

భూపాలపల్లి జిల్లా జులై 25 (విజన్ ఆంధ్ర ) పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, హెచ్.ఎం.ఆర్.డి.ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న దివ్యాంగ విద్యార్థుల పాఠశాలలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులు శ్రీ జె.జీవన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాలల్లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. వారికీ సరైన ఆహారం అందుతుందా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. పిల్లలను తమ సొంత కుటుంబ సభ్యుల్లాగా జాగ్రత్తగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

# కల్వకుర్తి నిర్మల స్కూల్లో విద్యార్థులపై మతమార్పిడి ఒత్తిడి!

- **"బొట్టు తుడవకపోతే పురుగుల అన్నం, కొట్టడం...**
- **వార్డెన్, నన్స్ పై సంచలన ఆరోపణలు...**
- **పోలీస్ స్టేషన్ కు తరలిన ABVP, బీజేపీ...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 25 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి పట్టణంలోని ప్రముఖ నిర్మల విద్యాలయం మిషనరీ స్కూల్ హాస్టల్ లో విద్యార్థులను మతం మార్చేందుకు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారంటూ సంచలన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

ప్రతిరోజు ప్రేయర్, ఆదివారం చర్చి తప్పనిసరి..

హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు గురువారం ఏబీవీపీ, బీజేపీ నాయకుల వెంట కల్వకుర్తి పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఎస్సై కురుమూర్తి కి ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో విద్యార్థులు కన్నీరు పెట్టుకుంటూ "గత కొన్నేళ్లుగా హాస్టల్ వార్డెన్ జయశ్రీ మరియు నన్స్ మమ్మల్ని మతం మారాలని వేధిస్తున్నారు. పడుకునేటప్పుడు, లేచినప్పుడు ప్రేయర్ చేయాలంటారు. ప్రతి ఆదివారం చర్చికి తప్పకుండా రావాలని ఒత్తిడి చేస్తారు. నుదుట బొట్టు పెట్టుకుంటే తుడిపేస్తున్నారు" అని వాపోయారు.

ఒత్తిడికి లొంగకపోతే వేధింపులు

"మేము వారి మాట వినకపోతే పురుగులు ఉన్న అన్నం పెడుతున్నారు. మోకాళ్ళపై కూర్చోబెట్టి కర్రలతో కొడుతున్నారు అని విద్యార్థులు ఆరోపించారు. భయంతో రోజులు గడుపుతున్నామని, ఇక భరించలేక బయటకు వచ్చామని చెప్పారు.

స్కూల్లో ఆందోళన, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

విషయం తెలుసుకున్న ఏబీవీపీ, బీజేపీ నాయకులు నేరుగా స్కూల్ కు వెళ్లి ప్రిన్సిపల్ జురీల్ ను నిలదీశారు. "మేము గతంలోనూ చేశాం, ఇకపై కూడా చేస్తాం" అని ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు.

దీంతో ఆగ్రహించిన నాయకులు ప్రిన్సిపల్, వార్డెన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. ఎస్సై కురుమూర్తి విద్యార్థుల నుంచి వాంగ్మూలం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఫిర్యాదులో పాల్గొన్న ప్రముఖులు

పట్టణ బీజేపీ అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు బోడ నరసింహ, కౌన్సిలర్లు వడ్డే శ్రీరాములు, ఏనుగొండ రామకృష్ణ, ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రశాంత్ యాదవ్ తో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆషాఢంలో ఆచారానికి అద్దం పట్టిన తోటపల్లి

- **తోటపల్లిలో ఘనంగా గోరింటాకు వేడుకలు**
- **తోటపల్లి గ్రామ సర్పంచ్ బంక లక్ష్మిచందు**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూలై 25 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు.గ్రామ పరిసరాల్లోని తాజా గోరింటాకు ఆకులను సేకరించి, వాటిని సంప్రదాయ పద్ధతిలో రుబ్బి ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకున్నారు. ఆటలు, పాటలు, జానపద గోరింటాకు గీతాలతో మహిళలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. గ్రామమంతా సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సందడి నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ బంక లక్ష్మి చందు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగు సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని, మహిళల ఐక్యత, ఆనందానికి ప్రతీకగా ఈ వేడుకలు నిలుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోలు రాజు, వార్డు సభ్యులు మానుక కుమార్, పోషవేణి కుమార్, శాతవేణి అనూష చందు, బొంగోని రేణుక రమేష్, పోగుల కవిత సత్యం, కొంగరి స్వరూప మల్లేశం, గుల్ల ఎల్లవ్వ లక్ష్మయ్య, అంగన్‌వాడీ టీచర్ గాదాసు విమల, ఆశా వర్కర్ కోతి వెంకటలక్ష్మి, సి.ఏ. వల్లపు రేణుక, వీవో అధ్యక్షురాలు దొంతర వేణి జ్యోతి, పోసవేని రాధికతో పాటు గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానికేతరులు క్రిమినల్ కేసులు ఉన్న వారిని ఖాజీలుగా ఎలా నియమిస్తారు

## హుస్నాబాద్ అలంగీర్ మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి అన్వర్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 25 : తెలంగాణ వక్ఫ్ బోర్డు నియమించిన సిద్దిపేట జిల్లా పరిధిలో గతంలోనే సదర్ ఖాజీ మరియు నాయబ్ ఖాజీలు ఉన్నారని మళ్లీ కొత్తగా ఖాజీలను నియమించడం ముస్లిం వర్గాల్లో గొడవలు సృష్టించడమేనని హుస్నాబాద్ పట్టణ అలంగీర్ మజీద్ కమిటీ అధ్యక్షులు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎండి అన్వర్ ఆరోపించారు.ఈ సందర్భంగా వారి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ఏర్పడిన తర్వాత వక్ఫ్ బోర్డ్ ప్రభుత్వ తరఫున సిద్దిపేట సదర్ ఖాజీగా జహీరుద్దీన్ హుస్నాబాద్ డివిజన్ నాయబ్ ఖాజీగా ఎండీ. అబ్దుల్ మన్నాన్ తెలంగాణ ఏర్పడిన తర్వాత కొన్ని సంవత్సరాల క్రితమే నియమించబడ్డారని తెలిపారు.ఆనాడు వక్ఫ్ బోర్డ్ లో సిద్దిపేట జిల్లా నుంచి ఖాజీలుగా ఎవరు దరఖాస్తు చేసుకోలేదని ఇప్పుడు కొత్తగా అనర్హులను సిద్దిపేట సదర్ ఖాజీగా ఖాజా ఖరీముద్దీన్ హుస్నాబాద్ నాయబ్ ఖాజీగా షేక్ రూహల్ అమీన్ ను తప్పుడు నివేదికలతో వక్ఫ్ బోర్డు ముస్లిం



నిబంధనలకు వ్యతిరేకంగా నియమించిదన్నారు. కొత్తగా నియమించిన వీరిపై క్రిమినల్ కేసులు, ఇప్పటికి కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని వీరు స్థానికులు కాదని పశ్చిమబెంగాల్ చెందిన వారన్నారు. స్థానికేతరులను కేసులు ఉన్న వారిని ఖాజీలుగా ఎలా నియమిస్తానని ప్రశ్నించారు.వాక్ఫ్ బోర్డులో రాజకీయాలు ఉండవని అర్హతలను బట్టి పరీక్షల్లో ఉత్తీర్ణత అయిన వారిని స్థానికులను మాత్రమే ఖాజీలుగా నియమిస్తారని అన్నారు.నిర్మల్ జిల్లాలో ఇలాగే అనర్హులను నియమిస్తే కోర్టుకు వెళ్తే కొత్తగా నియమించిన వారి ఖాజీల నియామకం రద్దు చేశారని ఇక్కడ కూడా సిద్దిపేట జిల్లాలో వీరి నియామక రద్దు చేయాలన్నారు.మేము మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వాస్తవాలు వివరించామని మేము వక్ఫ్ బోర్డులో జోక్యం చేసుకోమని మంత్రి హామీ ఇచ్చారని మళ్లీ వీరికి నియమించేందుకు లెటర్ ఇచ్చారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఖాజీ అంటే పవిత్రమైన అర్హతగల గొప్ప స్థానమని, పెళ్లిళ్లు చేసే సమయంలో ఎన్నో సమస్యలు ఉంటాయని ఖాజీగా స్థానికులు ఉండాలన్నారు. కొత్తగా నియమించిన స్థానికేతరుల ఖాజీలను తొలగించాలని డిమాండ్ చేశారు. వీరు ఖాజీలకు అర్హులు కాని వారు స్థానికులు కానీ వారిని నాయబ్ ఖాజీగా హుస్నాబాద్ ఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్లు ఎలా నివేదిక ఇస్తారని తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గంలో స్థానిక విచారణ చేయాలని,ముస్లిం వర్గాల్లో గొడవలు జరగకుండా చూడాలని అనర్హులైన ఖాజీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అలంగీర్ మజీద్ ఇమామ్ అబ్దుల్ బారి, మహమ్మద్ నయీముద్దీన్,ఎండి ముజాహిద్, ఎండి అబ్బు, ఎండి సలీం, కరీం తదితరులు పాల్గొన్నారు.

# మహోర్ దత్త మందిరాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

బోథ్. జూలై 25. (విజన్ ఆంధ్ర) : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాహూర్ ఘడ్ శ్రీ దత్తాత్రేయ మహారాజ్ ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కైలాష్ కైలాస్ టెక్డికి చెందిన ఆధ్యాత్మిక వేత్త శ్రీ. లింబాజీ మహారాజ్ తో కలిసి దర్శించారు. మహోర్ క్షేత్రానికి చేరుకున్న ఎమ్మెల్యే కు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే, లింబాజీ మహారాజ్ లు కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా కైలాష్ టెక్డి లింబాజీ మహారాజ్ తో కలిసి క్షేత్ర ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక విషయాలపై ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజున అత్యంత పవిత్రమైన మాహూర్ ఘడ్ దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకోవడం



నా పూర్వజన్మ సుకృతమని, దత్తాత్రేయ స్వామి వారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. బోథ్ నియోజకవర్గ ప్రజలతో పాటు, రెండు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, బోథ్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామి వారిని వేడుకున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, పీఠం నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వర్షాల కోసం వెంకన్న సన్నిధిలో వరద పాశం

**- ప్రత్యేక పూజలు.. తీర్థప్రసాదాలు.. అన్నదానం**

**- రైతాంగం సుభిక్షంగా ఉండాలని భక్తుల ప్రార్థనలు**

మర్పల్లి: జూలై 25 (విజన్ ఆంధ్ర) మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గుట్టపై వెలసిన శ్రీ ధనలక్ష్మివెంకటేశ్వర స్వామివారికి శనివారం స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో వరద పాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి స్వామివారిని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, ప్రజలు సుభిక్షంగా జీవించాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ, వ్యవసాయాధారిత ప్రాంతమైన మర్పల్లి మండలంలో రైతుల భవిష్యత్తు వర్షాలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, బోర్లు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పశు సంపదకు మేత, తాగునీటి కొరత లేకుండా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# విద్యార్థుల ఐక్య పోరాటం చారిత్రక విజయం

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య శక్తుల విజయానికి నిదర్శనం.విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. సోతుకు.ప్రవీణ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



భూపాలపల్లి జిల్లా జులై 25 (విజన్ ఆంధ్ర ) కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు సాగించిన ఐక్య, ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన గొప్ప విజయమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఉద్యమించారని, ఢిల్లీలో జరిగిన నిరసనలను అణచివేయడానికి లాఠీచార్జ్, టియర్ గ్యాస్ వంటి చర్యలకు పాల్పడినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని అన్నారు. చివరకు ప్రజా ఒత్తిడి, విద్యార్థుల ఐక్య ఉద్యమం ఫలితంగానే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.అయితే, రాజీనామాతోనే సమస్య ముగిసిపోయిందని భావించకూడదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, చనిపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావాలని, దేశ విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులకు అభినందనలు తెలియజేస్తూ, దేశ విద్యా వ్యవస్థను రక్షించే ఉద్యమాలు మరింత బలోపేతం కావాలని సోతుకు. ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి యువత విజయమే

## - మంత్రి పొన్నం ప్రభాకర్

ఆక్కన్నపేట, జూలై 25 (విజన్ ఆంధ్ర): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన ఐక్య పోరాటానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదని, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భమని ఆయన అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్ర బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టు అని వ్యాఖ్యానించారు.

విద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానమని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు విధించడం, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ





ఉద్యమం నిరూపించిందని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును హరిస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. ఈ రాజీనామా దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని అన్నారు.

విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పూర్తిగా మార్చుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులందరికీ అభినందనలు తెలియజేసిన ఆయన, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి మరింత బలంగా పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# చేవెళ్ల నూతన సీఐ నరేందర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

చేవెళ్ల, జూలై 25 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రెడ్డిని శనివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ల 1వ, 2వ వార్డుల బీఆర్ఎస్ కౌన్సిలర్లు దూత మల్లేశ్, దప్పు సువర్ణ – చందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణిస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉండి సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్షించారు. చట్టం, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొని నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

## - బలరాం జాదవ్



బోథ్. జూలై 25. (విజన్ ఆంధ్ర) : ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలంకు చెందిన ముక్రా, పరిసర ప్రాంతాల ప్రజలు ఆషాఢమాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల నుండి ఇచ్చోడ మండల కేంద్రంలోని విఠల రుఖ్మాయి మందిరానికి దిండి పాదయాత్ర గా వస్తారు. వీరితో కలిసి బలరాం జాదవ్ ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజక వర్గ ప్రజలు పాడి పంటలతో, ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ పాండురంగను కోరుకుంటున్నానని అన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి ఈ ప్రాంతమంతా పాడి పంటలతో వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



# హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం

నిజామాబాద్, జూలై 25 :(విజన్ ఆంధ్ర )నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తంగిరాల మాధవీదేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్ లకు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయ మూర్తులు ముందుగా స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి జీవీఎన్.భరత లక్ష్మి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, సీ.పీ, అదనపు కలెక్టర్ తదితరులతో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.

## సంతాపూర్ గ్రామంలో చైన్ స్నాచింగ్ స్నాచింగ్ సిసిటివి ఆధారంగా పోలీసుల గాలింపు

విజన్ ఆంధ్ర కేశంపేట 26 కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చి చైన్ లాక్ కెళ్ళినట్టు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి దృశ్యాలు సీసీటీవీ కెమెరాలు నమోదయ్యాయి. సిసి ఫుటేజ్ లో మాస్కులు ధరించిన వ్యక్తులు బైక్‌పై వెళుతున్న దృశ్యాలు క్లియర్ గా కనిపిస్తు న్నాయి. ఈఫుటేజ్ ఆధారంగా పోలీసులు దుండగులను గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలతో పాటు ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు నిందితుల వివరాలు ఇంకా తెలియ రాలేదు పోలీసుల విచారణ పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# ముస్లింల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



నిజామాబాద్ జూలై 25:( విజన్ ఆంధ్ర ( తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించడం జరిగింది. "ముస్లింల హక్కుల పరిరక్షణపై న్యూఢిల్లీ డిక్లరేషన్" విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ

దేశవ్యాప్తంగా ముస్లింలతో పాటు ఇతర బలహీన వర్గాల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, ఓటరు హక్కుల రక్షణ వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితాల సవరణ (ూ×=) ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేసిన పలువురు నాయకులు, ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు రక్షించబడేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

ముఖ్యంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు మరియు ఇతర బలహీన వర్గాలకు చెందిన ఓటర్ల హక్కులు ఎలాంటి అన్యాయానికి గురికాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడి హక్కులను కాపాడటం ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క బాధ్యత అని ఆయన అన్నారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం మరియు సమానత్వాన్ని పరిరక్షించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో జమ్మూ ఌ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ రాజ్యసభ సభ్యుడు మహమ్మద్ అదీబ్, మాజీ కేంద్ర విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు ప్రముఖులు, మేధావులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మరియు ముస్లిం సమాజ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# జిల్లా ఏఐటీయూసీ 4వ మహాసభలను విజయవంతం చేయాలి

### రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా అధ్యక్షులు కే. రామస్వామి - చేవెళ్ళ లో మహాసభల గోడపత్రిక విడుదల

చేవెళ్ళ, జూలై 25 (విజన్ ఆంధ్ర) : ఆగస్టు 2న తుక్కుగూడలో నిర్వహించనున్న రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ నాలుగో మహాసభలను కార్మికులందరూ విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా అధ్యక్షులు కే. రామస్వామి పిలుపునిచ్చారు. చేవెళ్ళ లో శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా నాలుగో మహాసభలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కే. రామస్వామి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఎనిమిది గంటల పనిదిన విధానాన్ని బలహీనపరిచే చర్యలు తీసుకుంటున్నారని, 12 గంటల పనిదినాలకు మార్గం సుగమం చేస్తున్నారని అన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, గ్రాట్యుటీ వంటి హక్కులు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించకపోవడంతో యాజమాన్యాల నిర్లక్ష్యం పెరుగుతోందని విమర్శించారు. ఆగస్టు 2న జరిగే మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, కార్మిక సమస్యలు, భవిష్యత్ పోరాటాలపై చర్చించి కార్యాచరణ రూపొందించనున్ ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్, ఏఐటిసి జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు బాబురావు, బికెసి జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, మండల ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీను, బాబు, హనుమంతు, కార్మికులు పాల్గొన్నారు.

# ఊరూరా విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమాలను చేపట్టాలి

### - రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

నిజామాబాద్, జూలై 25 :( విజన్ ఆంధ్ర) ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు. అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)లు, డీ.ఆర్.డీ.ఓలు, జెడ్పీ సీ.ఈ.ఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో, ఎం.పీ.డీ.ఓలతో మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ప్ సీ.ఈ.ఓ దివ్యదేవరాజన్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వీబీజీ రామ్-జీ (ఎదీ+-=ూవీ-+) పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విరివిగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని అన్నారు. గ్రామ సభలను నిర్వహిస్తూ ఈ పనుల ఆవశ్యకత గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వచ్చే




ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం వీబీజీ రామ్-జీ పథకం కింద ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విరివిగా జలసిరి కార్యక్రమం అమలయ్యేలా చూడాలన్నారు. ఈ పనుల పరిశీలన కోసం మండల స్థాయిలో గ్రామీణ నీటి సరఫరా ఏ.ఈ, పంచాయతీరాజ్ ఏ.ఈ, ఎం.పీ.డీ.ఓ, ఎం.పీ.ఓ, ఏ.పీ.ఓలతో కమిటీని ఏర్పాటు చేసి, వారి ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతీచోట పండగ వాతావరణంలో జలసిరి కార్యక్రమాలు అమలు జరగాలని, ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. కూలీలకు చేతినిండా పని కల్పిస్తూ, పనిదినాల లక్ష్యాన్ని సాధించడంతో పాటు నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని హితవు పలికారు. వీబీజీ రామ్-జీ పథకం కింద 318 రకాల పనులను చేపట్టవచ్చని, అయితే ప్రస్తుత తరుణంలో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలలో చర్చించుకుని చేపట్టే ప్రతి పని ప్రజలకు ఉపయోగకరంగా నిలువాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం... కాంగ్రెస్ నాయకులు..

బోధన్, జులై25 (విజన్ ఆంధ్ర) : ఈ నెల 29, 30, 31న బోధన్ పట్టణంలోని రెంజల్ బేస్ లో గల సయ్యద్ షా జలాల్ బుఖారి దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ తో కలిసి జలాల్ బుఖారీ దర్గాను దర్శించుకున్నారు. దర్గా వద్ద చేపడుతున్న పనులను పరిశీలించారు. పెద్ద ఎత్తున విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంకు దాము, ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పాషా, ఏజస్, జహీర్, జావీద్, మీర్ నజీర్ అలీ, బాబా, దర్గా కమిటీ సభ్యులు ఉన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మందమర్రి, జూలై 25 (విజన్ ఆంధ్ర) : అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన,శిక్షణ కార్యక్రమాన్ని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శనివారం నిర్వహించారు. రెస్క్యూ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆకస్మికంగా సంభవించే అగ్ని ప్రమాదాలను ఫైర్ ఎక్విప్మెంట్ పరికరాలతో అదుపులోకి తీసుకువచ్చే విధాన్ని ప్రాక్టికల్ డెమోతో వివరించారు. ఈ కార్యక్రమంలో డివైసీఎంవో అడ్మిన్ మధు కుమార్,రెస్క్యూ ఇంచార్జ్ రామ్ మోహన్,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదర్ సాహెబ్, వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల గెలుపు

నిజామాబాద్ జూలై25:( విజన్ ఆంధ్ర ) : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ స్పందన.....

ఈరోజు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల గెలుపు అని ప్రజాస్వామ్య గెలుపుకు ఇది ఒక నిదర్శనం, ఎన్ని రోజులు బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిందని, కానీ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తూ తమ హక్కులను కాపాడుకోవాలని చేసిన కృషిలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు రాహుల్ గాంధీ మద్దతు తెలుపడం ఇతర నాయకులు మద్దతు ఇవ్వడం ద్వారా బిజెపి ప్రభుత్వం దిగి రావాల్సి వచ్చిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తో పాటు ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల మధ్యకు వచ్చి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు. గతంలో నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులను ఇబ్బంది



పెట్టాలని చూసారని, అదేవిధంగా నీట్ పేపర్ లీక్ ద్వారా నైపుణ్యమున్న విద్యార్థులను కాకుండా నైపుణ్యతలేని విద్యార్థులను అందలం ఎక్కించే ప్రయత్నం బిజెపి చేసిందని ఆయన అన్నారు. బిజెపి కేంద్ర క్యాబినెట్లో అసమర్థమంత్రులు ఉన్నారని ఒకసారి సమీక్షించుకొని సరైన నాయకులను మంత్రులుగా నియమించి పాలనను ముందుకు నడపాలని బొబ్బిలి రామకృష్ణ హితవు పలికారు. నరేంద్ర మోడీ పత్రిక ముందుకు ప్రజల ముందుకు వచ్చి ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని విద్యార్థులకు జరిగిన అన్యాయంపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని బొబ్బిలి రామకృష్ణ డిమాండ్ చేశారు.

## ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు

### నీట్‌లో విజయం సాధించిన సత్యశోధక్ పూర్వ విద్యార్థినికి సత్కారం - ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య

నిజామాబాద్ జూలై25 : ( విజన్ ఆంధ్ర) : విద్యార్థులు నిరంతర శ్రమ, ఆత్మ విశ్వాసంతో సాధన చేస్తే ఎలాంటి అవంతరాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వైద్య ప్రవేశ పరీక్ష నీట్-2026లో విశిష్ట విజయాన్ని సాధించిన సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థిని బి.సౌందర్య, తండ్రి ప్రకాష్ లను ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపిక, శాలువ అందజేసి ఘనంగా సన్మానించిఅభినందించడమైనది. బి.సౌందర్య(కర్నాల్ తండా,హొన్నాజీపేట్ గ్రామం, ధర్పల్లి మండలం )ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాలలో గిరిజన విభాగం కేటగిరిలో 2762 ర్యాంక్ సాధించడమైనది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని తన కృషి, క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనతో దేశవ్యాప్తంగా అత్యంత పోటీతో కూడిన నీట్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నా రు. నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థులకు సూచించారు. సౌందర్య సాధించిన ఈ విజయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవలందించే ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి దేశానికి, తల్లిదండ్రులకు మరియు స్వగ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని విద్యార్థినిని అభినందించి ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు.

## 22వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ

### మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం

### పెద్దపేట: కౌన్సిలర్ పీక ఎల్లబాయ్

బెల్లంపల్లి, జూలై 25 విజన్ ఆంధ్ర బీ బెల్లంపల్లి మున్సిపాలిటీ 22వ వార్డులో కౌన్సిలర్ పీక ఎల్లబాయ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సంఘాలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పీక ఎల్లబాయ్ మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వర్గం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హామీలను దశలవారీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు గౌరవం, భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీక లక్ష్మణ్, లబ్ధిదారులైన మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి విద్యార్థినికి అండగా 'పోలీస్ అక్క'
- ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్

పెద్ద శంకరంపేట్, జూలై 25: విజన్ ఆంధ్ర: మెదక్: విద్యార్థినుల భద్రతకు 'పోలీస్ అక్క' అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. పెద్ద శంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా 'పోలీస్ అక్క'ను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి 'పోలీస్ అక్క'లు కృషి చేస్తారని తెలిపారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధికి 'పోలీస్ అక్క'గా గౌతమి, కానిస్టేబుల్‌ను నియమించారు. విద్యార్థినులకు



'పోలీస్ అక్క' ఫోన్ నంబర్‌ను అందించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ అక్కకు చెప్పేందుకు ఎలాంటి భయం, సందేహం అవసరం లేదని ఎస్పీ తెలిపారు. సమస్యలను నేరుగా పోలీస్ అక్కను కలిసి లేదా ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను గోప్యంగా తెలుసుకుని, అవసరమైన సహాయం అందించడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--112, షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారితో స్నేహపూర్వకంగా మమేకమవుతారని ఎస్పీ తెలిపారు. వారి సమస్యలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తారని పేర్కొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందేలా ప్రోత్సహిస్తారని చెప్పారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా దాచిపెట్టకుండా 'పోలీస్ అక్క'కు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రేణుక, సందీప్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, పోచయ్య, 'పోలీస్ అక్క' గౌతమి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నాం

**- లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్**



విజన్ ఆంధ్ర కేశంపేట 26 భారతదేశ యువత చేపట్టిన పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్య విజయమని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాల్ నాయక్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ పరీక్షలలో ప్రశ్నాపత్రం లీక్ మరియు ఇతర అక్రమాల ఆరోపణలు తీవ్ర నిరసనలకు దారితీసాయి. విద్యార్థి సంఘాలు మరియు ప్రతిపక్ష పార్టీలు విద్యాసంస్థలు జవాబు దారి తనం కోరుతూ ఆయన రాజీనామాను డిమాండ్ చేశాయి. వారాలపాటు కొనసాగిన విద్యార్థి ఆందోళనలు ర్యాలీలు నిరాహార దీక్షలు మరియు పోలీసులు చర్యల నేపథ్యంలో ప్రభుత్వంపై రాజకీయ ప్రజా ఒత్తిడి పెరిగింది. ఈ సందర్భంగా రాంబాల నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు యువత తలుచుకుంటే ఏ ప్రభుత్వమే నా తలవంచక తప్పదని ఈ ఘటన ద్వారా మరోసారి రుజువైందని ఏ ప్రభుత్వమైనా విద్యార్థుల భవిష్యత్తులో చెలగాటమాడితే ఇదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రజా వ్యతిరేక విధానాలకు బాల్పడిన యువత తిరగబడటం ఖాయమని అన్నారు.

## పంట మార్పిడితోనే రైతులకు, సమాజానికి మేలు..

**- పెసర విత్తనాలు చల్లిన**

**- జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్..**

మరిపెడ, విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్న--బుజ్జి దంపతుల వ్యవసాయ భూమిలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పెసర విత్తనాలు వేసి పంటమార్పిడి విధానాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహశబరీష్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వరి, మొక్కజొన్న తో పాటు పప్పు ధాన్యాలు, కూరగాయలు పండించి రైతులు తమ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు, కార్యక్రమంలో డీఏఓ విజయ్ చంద్ర, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, పలు శాఖల అధికారులు, మరిపెడ మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు పెండ్లి రాఘవీరా రెడ్డి, తదితరులు ఉన్నారు,



## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీ ముదిరాజ్ ముద్దుబిడ్డ

**- పోరాట యోధుడు ఎర్ర సత్యం అన్న ఘనంగా జయంతి వేడుకలు**



భూపాలపల్లి జిల్లా జులై 25 (విజన్ ఆంధ్ర ) జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీ ముదిరాజ్ ముద్దుబిడ్డ, పోరాట యోధుడు ఎర్ర సత్యం అన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్తో పాటు పార్టీ నాయకులు పాల్గొని ఎర్ర సత్యం అన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ, ఎర్ర సత్యం అన్న తన జీవితాన్ని పేద ప్రజల సేవకు అంకితం చేశారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ, తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి తన వంతు బాధ్యతగా సహాయం అందించారని కొనియాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ప్రజల ఆదరణ పొందిన నాయకుడిగా ఎర్ర సత్యం అన్న గుర్తింపు పొందారని, ఆయన పేరు వినగానే పేద ప్రజల గుండెల్లో నమ్మకం, ఆనందం కలిగేదని తెలిపారు. అలాంటి ప్రజానాయకుడిని కొందరు వ్యక్తులు కక్షపూరిత ధోరణితో నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. ఎర్ర సత్యం అన్న ఆశయాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు తీసుకెళ్తోందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని రవి పటేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు సామల శ్రీలత, క్రమశిక్షణ కమిటీ నాయకుడు కరుణాకర్, కార్మిక విభాగం నాయకుడు అనంతుల సంపత్, ఎలక్ట్రిషియన్ విభాగం నాయకుడు అశోక్, జిల్లా నాయకులు సమ్మయ్య, రాంబాబు, సలీం, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

అందోల్ జూలై 25(విజన్ ఆంధ్ర ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా రామచంద్రపురం డివిజన్ విజిలెన్స్ అధికారులు, మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ పలు ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులపై శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సన్నధాన్యం ఈ-వేలం ప్రక్రియ, కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వల్లో వస్తున్న తేడాలు, మరియు రికార్డుల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలపై అందిన పక్కా సమాచారంతో అధికారులు ఈ విస్తృత సోదాలు చేపట్టారు.



**ధాన్యం నిల్వలు, రికార్డుల క్షుణ్ణంగా పరిశీలన**

మిల్లుల్లో అందుబాటులో ఉన్న ప్రత్యక్ష ధాన్యం నిల్వలను, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలతో అధికారులు క్షుణ్ణంగా సరి చూస్తున్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలోని పలు రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు జరిగిన నేపథ్యం ఉండటంతో, గత కొంతకాలంగా జరుగుతున్న ధాన్యం లావాదేవీలు మరియు స్టాకు తేడాలపై అధికారుల బృందం ప్రత్యేక దృష్టి సారించింది. మినహాయింపు లేకుండా ప్రతి మిల్లులోని సీఎంఆర్ బియ్యం కేటాయింపులు, ధాన్యం బస్తాల సంఖ్యను ప్రత్యేక బృందాలు నమోదు చేస్తున్నాయి.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు -- మిల్లు నిర్వాహకుల్లో ఆందోళన**

ఈ తనిఖీల అనంతరం వెల్లడయ్యే వ్యత్యాసాలు మరియు విజిలెన్స్ నివేదికల ఆధారంగా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన రైస్ మిల్లు నిర్వాహకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అధికారుల ఆకస్మిక దాడుల నేపథ్యంలో మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ స్థానిక రైస్ మిల్లుల నిర్వాహకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు, సీజ్ చేసిన నిల్వల సమగ్ర నివేదిక ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## ఘనంగా గవ్వ వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

కోహెడ విజన్ ఆంధ్ర జులై 25 : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో యువసేన మండల అధ్యక్షులు మహమ్మద్ ఒవైస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వంశీధర్ రెడ్డి విద్యార్థి ఉద్యమ నేతగా,రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, అంచలంచలుగా ఎదుగుతూ,ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ, గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ని ప్రారంభించి హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యా, వైద్యం,ఆధ్యాత్మిక, సామాజిక రంగాలలో గత 15 సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్నారన్నారు. ప్రజలు మరియు యువకుల మద్దతు పొందటం గర్వకారణమని ప్రతి సమస్యపై స్పందించడం ఆయన నైజమని,వంశీధర్ రెడ్డి లాంటి నాయకుడు కోహెడ మండలంలో జన్మించటం మా అందరికీ గర్వకారణమని అన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి, పటాకులు కాల్చి, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో గవ్వ వంశీధర్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, వంశీధర్ రెడ్డి అభిమానులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి...

### బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పిలుపు..

బోధన్, జులై 25(విజన్ ఆంధ్ర) : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ నివాసంలో బీఆర్ఎస్ నాయకురాలు అయేషా ఫాతిమా ఆమెర్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు తో కలిసి మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్ విచ్చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో వేగవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూనే గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే రోజుల కార్యాచరణపై నాయకులు చర్చించారు. అన్ని కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కో ఆర్డినేటర్ సుష్మిత, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రవీందర్ యాదవ్, సంజీవ్ కుమార్, నర్సన్న, శ్రీరామ్, భూమారెడ్డి, నర్సింగ్ రావు, కౌన్సిలర్లు ముషీర్ బాబా, మోబీన్, అజార్, లక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి వేళ చేవెళ్లలో భక్తిశ్రద్ధలతో ప్రభాత నగర సంకీర్తన

చేవెళ్ల, జూలై 25 (విజన్ ఆంధ్ర): హిందూ సంప్రదాయంలో విశిష్ట ప్రాధాన్యం కలిగిన ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) సందర్భంగా శనివారం తెల్లవారుజామున చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రభాత నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన సంకీర్తన పురవీధుల గుండా కొనసాగింది. భక్తులు "శ్రీరామ్ జయరామ్ జై జై రామ్" నామస్మరణతో భక్తి గీతాలు ఆలపిస్తూ గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం తిరిగి ఆంజనేయ స్వామి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ... తొలి ఏకాదశి రోజున రామనామ స్మరణ, భజనలు, సంకీర్తనలు నిర్వహించడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందడంతో పాటు సమాజంలో శాంతి, సత్సంకల్పాలు నెలకొంటాయని పేర్కొన్నారు. ప్రతి నెల శుద్ధ ఏకాదశి సందర్భంగా నిర్వహించే ప్రభాత నగర సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని



భగవన్నామ స్మరణను విస్తృతంగా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్ల నవీన్ రెడ్డి, వంశిధర్ రెడ్డి, గవ్వల మల్లేష్, బండారి శైలజ, దేవర రమణారెడ్డి, వెంకటేష్ పాగ, చారి, చేగూరి బోజిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, చినుమరి మహిపాల్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, అభిషేకర్ రెడ్డి, మహిపాల్, అనంత్ రెడ్డి, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా యువత పోరాట విజయమే

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**- విద్యార్థుల నమ్మకాన్ని నిలబెట్టే పారదర్శక పరీక్షా వ్యవస్థ అవసరమని అభిప్రాయం**

తలకొండపల్లి, జూలై 25, (విజన్ ఆంధ్ర) : కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా దేశ యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు సాగించిన ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన విజయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నిజం, న్యాయం, జవాబుదారీతనం కోసం లక్షలాది మంది విద్యార్థులు, యువత అలుపెరగని పోరాటం చేశారని, ఆ సంకల్పానికి ఈ పరిణామం నిదర్శనమని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి సమస్యలను పార్లమెంట్ లోపల, బయట నిరంతరం ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరిన ప్రతిపక్షాల పాత్రను ఆయన అభినందించారు.



మంత్రి రాజీనామాతో సమస్య ముగిసినట్లు గా భావించరాదని, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో విశ్వాసం పెంపొందించే విధంగా పారదర్శకమైన, విశ్వసనీయమైన, ప్రతిభకు న్యాయం చేసే పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

"యువత న్యాయం కోసం ఏకమైతే ప్రజాస్వామ్యం తప్పక స్పందిస్తుంది" అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ పరిణామం దేశ విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలకు నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

**- ప్రభుత్వ భూముల్లో రోజుల తరబడి తవ్వకాలు**

**- రాసులపల్లి టు అశ్వారావుపేట**

**- మైనర్లతో లైసెన్స్ లేని డ్రైవర్లతో హావ**

జులై 26 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం నియోజకవర్గంలోని మట్టి మాఫియా రోజుకో కొత్త పోకడ అవలంబిస్తోంది,రూపాలు ఎన్నైనా పాపాలు అవే అన్నట్లు రోజుకో రూపంలో అక్రమ మట్టి మాఫియా రంగులు మారుస్తూ యథేచ్ఛగా చెరువుల్లో, ప్రభుత్వ పట్టా భూముల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరిపేస్తూ అమ్మకాలు కొనసాగిస్తోంది,ప్రస్తుత మట్టి డిమాండుకు తగ్గట్టు మండలాలు దాటిస్తూ వందల ట్రిప్పులు అమ్మకాలు జరుపుతున్నాయని, అనోటా ఇనోట దమ్మపేట, అశ్వారావుపేట మండలాల వ్యాప్తంగా వినిపిస్తున్న విషయాలు,

వివరాల్లోకి వెళితే ప్రస్తుతం మట్టి బంగారం కంటే ఎక్కువ డిమాండ్ ఉండడంతో మట్టిమాఫియా మండలాలను దాటిస్తూ ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు వేలరుపాయలకు ధరలు నిర్ణయించి గ్రామీణ గిరిజనుల భూముల్లో 1/70 యాక్ట్ కు విరుద్ధంగా అక్రమ మైనింగ్ చేస్తూ లక్షలు దండుకుంటున్నారు కొందరు అక్రమార్కులు అయితే అశ్వారావుపేట కు చెందిన వ్యక్తులు దమ్మపేట మండలం లో గత రెండురోజులుగా రాచరపల్లి గ్రామం నుండి జేసిబి నెం:– ఎ.పి40ఇ.ఎఫ్2406 టాటా శింరై జేసీబీ తో సుమారు ఇరవై గుర్తుతెలియని, నెంబర్లు లేని ట్రాక్టర్లతో



అశ్వారావుపేట , జమ్మిగూడెం, రాజానగరం, ఉట్లపల్లి కు రాచరపల్లి లో ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి అమ్మకాలు చేస్తున్నట్లు గ్రామస్తులు సమాచారం , గత రెండు రోజులుగా మట్టి మాఫియా నిరంతరం తవ్వకాలు సాగిస్తున్న ప్రభుత్వ అధికారులు చర్యలు శూన్యంగానే వున్నాయి. రెండు మండలాల్లో రెండు రోజులుగా బహిరంగంగానే మట్టి తవ్వకాలు మట్టి రవాణా రహదారులుపైనే జరుగుతున్న అధికారులకు కనీస సమాచారం లేదంటే గ్రామీణస్థాయిలో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు

మట్టి మాఫియా వాళ్ల రవాణా రహదారులు దుమ్ము, మట్టి పాలవుతున్నాయి, వర్షాకాలం కావడంతో మట్టి రోడ్లపై పేరుకుపోయి వాహనాదరులకు ప్రమాదలకు కారణం అయ్యి ప్రాణాలు పోయే అవకాశాలు పుష్కలంగా వున్నాయి, ఇదంతా ఒకేత్తతే మరోపక్క కనీసం మట్టి ట్రాక్టర్లకు రిజిస్టేషన్ నెంబర్లు లేకుండా రోడ్లపైకు మృచ్యుకుహల్లగా తిరిగుతుంటే అధికార యంత్రాంగనికి చీమకుట్టినట్టైనా లేదు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అ ప్రమాదం ప్రశ్నర్ధకంగా ఇరుకుటుంబలకు మిగలకముందే అధికారుల చర్యలు అవసరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

**మైనర్లు, లైసెన్స్ లేనివారే డ్రైవర్లు**

అక్రమ మట్టి మాఫియాలో ఎక్కువ శాతం డైవర్లు మైనర్లే కావడం విశేషం కనీసం అవగాహన లేని చిన్న పిల్లలతో డ్రైవింగ్ చేయించడం నియోజకవర్గం మట్టి మైనింగ్ లో సహజంగా జరిగేవే, కానీ ప్రమాదం జరిగినప్పుడు జాగర్తపడడం కంటే ముందుగా అధికారులు చర్యలు తీసుకోవడం మంచిది, లైసెన్స్ లేని డ్రైవర్లు పది మంది నిష్పాత్తి లో ఏడుగురికి లైసెన్స్ లేకుండా వాహనాలు నడుస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం,అధికారులు ఇటువంటి మట్టిమాఫియాపై చర్యలు తీసుకుని ప్రమాదలను అరికట్టాలని , అక్రమ మైనింగ్ దొంగలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు

**దమ్మపేట మండలం ఎం.ఆర్.ఓ వివరణ మద్దినేని మురళి వివరణ:–**

మట్టితవ్వకాల గురించి శనివారం ఉదయం తమకు సమాచారం వచ్చిందని దానితో మా స్టాఫ్ ని ఘటనా స్థలానికి పంపామని అప్పటికే జేసీబీ, ట్రాక్టర్ల మట్టి దొంగలు పారిపోయారని, అయినా సరే ఘటనపై విచారణ జరుపుతున్నామని, అక్రమార్కులు దొరికితే కఠినచర్యలు తప్పవని దమ్మపేట రెవెన్యూ అధికారి మద్దినేని మురళి తెలియజేసారు

# ప్రతి పనిపై శ్రద్ధ వహించాలి

**- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి..**

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..**

నిజామాబాద్ జూలై :( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రతి పనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ శ్రద్ధ వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సూచించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం పబ్లిక్ హెల్త్ ఆర్ అండ్ బి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 కోట్లతో ప్రారంభమైన పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి డివిజన్ కు కోటి రూపాయలు కేటాయించారని త్వరలోనే అన్ని డివిజన్లో పనులు ప్రారంభమవుయని తెలిపారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిపై సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే నూతన పనులపై ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ప్రధానగా నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి వరకు రూ.30 కోట్లతో రోడ్డు ప్రతిపాదిచామన్నారు అలాగే ఆర్ యూబీ ల నిర్మాణానికి రూ.60 కోట్లు, నాందేవ్ వాడ వంతెన పొడిగింపునకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అమృత్ 2 కింద మంజూరైన యూజీడీ పనుల్లో వేగం పెరిగిందని తెలిపారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, డీఈ యోగేందర్, ఏఈ శంకర్, యూ జీ డీ ప్రాజెక్ట్ మేనేజర్ జయశంకర్, ఆర్ అండ్ బి అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శివంపేటలో రూ.1 కోటి అభివృద్ధి పనులకు శ్రీకారం



చౌటకూర్, జూలై 25 (విజన్ ఆంధ్ర) :- చౌటకూర్ మండలంలోని శివంపేట గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడం, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం గ్రామ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తిక దశరథ్, సర్పంచ్ సంధ్య మల్లికార్జున్ గౌడ్, ఉ పసర్పంచ్ నత్తి సందీప్ కుమార్, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతుల క్షేమమే ధ్యేయం -ఏఈ విజయ్ కుమార్

అనంతపురం జూలై 25 ( విజన్ ఆంధ్ర ): రైతుల అభివృద్దే తమ ధ్యేయమని గార్లదిన్నె ట్రాన్సకో అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్హత కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు వారు కోరిన సామాగ్రి వరుస క్రమంలో అందజేసి న్యాయం చేస్తున్నామని ఇంకా మిగిలిన రైతులకు కూడా తొందరలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సామాగ్రి అందిస్తామని ఏఈ అన్నారు. కొందరు లేని పోనీ ఆరోపణలు చేస్తున్నారని ఇది చాలా బాధాకరమని నిజాలు తెలుసుకొని ఆరోపణలు చేస్తే మంచిదని ఏఈ విజయ్ కుమార్ హితవు పలికారు.

# ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయం

**- కందారపు మురళి**



తిరుపతి : కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అభివర్ణించారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక వైఖరికి పరాకాష్ట నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అని, ఇందులో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు నిర్వహించిన పోరాటం దేశంలో సరికొత్త మార్పుకు నాంది పలికిందని పేర్కొన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా తమను ప్రశ్నించేవారు ఎవరూ లేరన్న ధీమాతో ఉన్న బిజెపికి, కార్పొరేట్ జనతా పార్టీ ఇచ్చిన షాక్ మామూలు షాక్ కాదని కందారపు మురళి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సగటు భారతీయ విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటో ఈ ఉద్యమం ద్వారా వెల్లడి అయిందని, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన దుర్మార్గపు విధానాలు విడనాడి భారత దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేయాలని, ధరల తగ్గింపుకు పూనుకోవాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సాగించిన అపూర్వ పోరాట ఘట్టాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# ట్రాన్స్‌ఫర్ అయిన టౌన్ ప్లానింగ్ అధికారులను వెంటనే రిలీవ్ చేయాలి

**-నిజాంపేట్ సర్కిల్‌లో బదిలీల అమలుపై సందిగ్ధత**

**-అకుల సతీష్ టీమ్ డిమాండ్-బదిలీ ఉత్తర్వులు జారీ అయినా విధుల్లోనే కొనసాగుతున్నారన్న ఆరోపణలు**

**-కమిషనర్ తక్షణ జోక్యం చేసుకుని స్పష్టత ఇవ్వాలని డిమాండ్**

**-ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచన**

నిజాంపేట్, జూలై 25 (విజన్ ఆంధ్ర): జీహెచ్ఎంసీ కమిషనర్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల మేరకు నిజాంపేట్ సర్కిల్‌కు చెందిన కొంతమంది టౌన్ ప్లానింగ్ వార్డ్ అధికారులకు బదిలీలు జరిగినప్పటికీ, వారు ఇప్పటికీ అదే సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఇతర మున్సిపాలిటీలు, సర్కిళ్ల నుంచి బదిలీపై వచ్చిన అధికారులు నిజాంపేట్ సర్కిల్‌లో ఇప్పటికే రిపోర్ట్ చేసి తమ విధులను నిర్వహిస్తున్నారని సమాచారం. అయినప్పటికీ, బదిలీ అయిన పాత అధికారులు ఇంకా టౌన్ ప్లానింగ్ విభాగంలో కొనసాగడం పరిపాలనలో అయోమయానికి దారితీస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై స్పందించిన అకుల సతీష్ టీమ్, బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసినట్లయితే వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. బదిలీ అయిన అధికారులను వెంటనే వారికి కేటాయించిన స్థానాలకు రిలీవ్ చేసి పంపాలని, కొత్తగా వచ్చిన అధికారులకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేసింది. అలాగే ఈ అంశంపై జీహెచ్ఎంసీ కమిషనర్, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని వాస్తవ పరిస్థితులపై స్పష్టత ఇవ్వడంతో పాటు, బదిలీ ఉత్తర్వులను పారదర్శకంగా అమలు చేయాలని అకుల సతీష్ టీమ్ కోరింది.

# ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి పౌరుడు ముందుకు రావాలి

**- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**-ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ఎమ్మెల్యే**

**-కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారిలోనూ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి**

**-సకాలంలో ఫారాలు సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపు**



కుత్బుల్లాపూర్, జూలై 25 (విజన్ ఆంధ్ర); ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి పౌరుడు తన హక్కుగా, బాధ్యతగా భావించి తప్పనిసరిగా విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్ కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్వయంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలాధారమని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకొని ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో పాటు పొరుగువారు, బంధువులు, స్నేహితులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఓటు విలువపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ప్రతి బాధ్యతగల పౌరుడి కర్తవ్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు మహేశ్వరి, రాజ్‌కుమార్, బూత్ స్థాయి ప్రతినిధులు వినయ్, లావణ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్యాల్ లో అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య



నిర్మల్. జూలై 25. ( విజన్ ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచంద మండలం వడ్యాల్ గ్రామంలో తలారి రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం. తలారి రమేష్ (38) ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటెండర్ గా పనిచేస్తున్నాడు. అప్పుల మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉ న్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా తొలి ఏకాదశి ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. నిజామాబాద్ సాంస్కృతికం

నిజామాబాద్ జూలై25:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగర ప్రజలు తొలి ఏకాదశిని ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని జెండా గల్లీలో గల జెండా బాలాజీ ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని ఉదయం స్వామివారికి అభిషేకం ,అర్చన ,విశేష పూజలు నిర్వహించారు. భక్తమండలి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అఖండ విష్ణు సహస్ర పారాయణం సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమములో కార్య నిర్వహణ అధికారి గింజుపల్లి వేణు , చైర్మన్ లవంగా ప్రమోద్ కుమార్ , అర్చకులు నాగరాజ చార్యులు జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్ భక్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ గీతా మందిరంలో ...

నగరంలోని శివాజీ నగర్ వద్ద గల శ్రీకృష్ణ గీత మందిరంలో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకం, అర్చన, విశేష పూజ నిర్వహించారు. శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శని శెట్టి కిషన్ కార్యదర్శి గాలి నాగరాజు గుప్తా, కోశాధికారి నూకల లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

విఠలేశ్వరాలయంలో..

నగరంలోని విఠలేశ్వరుని ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన ,విశేష పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దత్త మందిరంలో..

నగరంలోని దత్త మందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆల అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం హారతి అర్చన విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ ఆలయం అధ్యక్షులు అడ్డగుల్ల భాస్కర్ గుప్త, ప్రేమలత, అడ్డగుల్ల ప్రవీణ్ గుప్త, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణ ఆలయంలో..

నగరంలోని మురళీకృష్ణ ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా హారతి అభిషేకం విశేష పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుందర సత్సంగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా జిల్లా ఇంచార్జిగా పీసర సాయినాథ్ గౌడ్



ముధోల్ :జులై 25 :విజన్ ఆంధ్ర :నిర్మల్ జిల్లా: ఉప సర్పంచుల ఫోరం సోషల్ మీడియా ఇన్చార్జిగా శనివారం ముధోల్ మండలం చించాల గ్రామ ఉపసర్పంచ్ పీసర సాయినాథ్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులు పొద్దుటూరి సంపత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పీసర సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ.. నా పై నమ్మకం తో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ మరియు జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సంపత్ రెడ్డిలకు తన తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నానన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యల తో పాటు, తన సహచర ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి అన్నివేళలా కృషి చేస్తానని అన్నారు. సోషల్ మీడియా ద్వారా చురుకుగా ఉంటూ ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికై తన వంతుగా పాటుపడతానని వెల్లడించారు.

# లింగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాదవ్ రమేష్ నియామకం

లింగాపూర్ జులై 25(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాదవ్ రమేష్ నియమితులవడం పట్ల మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లింగాపూర్ మండల రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ స్వర్గీయ జాదవ్ హిరామన్ గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న జాదవ్ రమేష్‌కు పార్టీ అధిష్ఠానం మండల అధ్యక్ష పదవిని అప్పగించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి, యువతను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే నాయకత్వ లక్షణాలు జాదవ్ రమేష్‌లో ఉన్నాయని జిల్లా డి సి సి ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ కొనియాడారు.



ఆయన నాయకత్వంలో లింగాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, ప్రజలకు చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జాదవ్ రమేష్‌కు మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన విజయవంతంగా బాధ్యతలు నిర్వహించి పార్టీకి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నూతన సీఐ, ఎస్సైలకు శాలువాతో సత్కారం



చేవెళ్ల, జూలై 25 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు చేరువగా ఉంటూ సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. వైభవ్ రెడ్డి కోరారు. శనివారం బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెలి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి, ఎస్సై కోటేశ్వర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. వైభవ్ రెడ్డి మాట్లాడుతూ... చట్టం, శాంతిభద్రతల పరిరక్షణలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత చూరగొనాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసరి శ్రీకాంత్ రెడ్డి , నల్ల నవీన్, వద్దే గణేష్, అగ్రపల్లి అశోక్, బండారి చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అల్లాడ అభిషేకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అన్నారం దర్గాలో భారీ కుంభకోణం

**- అవినీతి అక్రమార్కుడికే మళ్లీ తలనీలాల టెండర్!**

**- రెండు సంవత్సరాల క్రితం రూ. 60 లక్షల విలువైన తలనీలాలు మాయం..**

**- కలెక్టర్, వక్ఫ్ బోర్డు విచారణ నివేదికలను బేకాతర్ చేసిన అధికారులు..**

**- బహిరంగ వేలం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా మూడేళ్ల టెండర్ కరారు..**

**- ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పందించాలని ప్రజల డిమాండ్...**





వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై25(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్యక్షేత్రం హజరత్ యాకూబ్ షా వలి బాబా దర్గాలో భారీ అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి. గత రెండేళ్ల క్రితం నుండి సుమారు 60 లక్షల రూపాయల విలువైన భక్తుల తలనీలాలను గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసి అమ్ముకున్న వ్యక్తికే, రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు తిరిగి మూడేళ్ల పాటు టెండర్‌ను దారాదత్తం చేయడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

కలెక్టర్ విచారణను సైతం పక్కనబెట్టి..!

నిబంధనల ప్రకారం దర్గా తలనీలాల సేకరణ టెండర్‌ను హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు కార్యాలయం ద్వారా బహిరంగ వేలం వేసి కేటాయించాల్సి ఉంటుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా అన్నారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఎలాంటి అధికారిక టెండర్ లేకుండానే దర్గాలోని తలనీలాలను సేకరించి, సుమారు రూ. 60 లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాడు. ఈ అక్రమాలపై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విచారణ చేపట్టారు. దర్గాలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు నిర్ధారిస్తూ కలెక్టర్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నివేదిక కూడా పంపారు.

అంతేకాకుండా, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రియాజ్, దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్ హుస్సేన్‌లు సైతం సదరు వ్యక్తి రెండేళ్ల పాటు అక్రమంగా తలనీలాలను తరలించినట్లు రాతపూర్వకంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు నివేదించారు. ఇంతటి స్పష్టమైన ఆధారాలు, నివేదికలు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు సదరు అక్రమార్కుడిపై చర్యలు తీసుకోకపోగా.. అతనికే వత్తాసు పలకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టుగా మూడేళ్ల టెండర్ కరారు!

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అదే వ్యక్తికి ఈ ఏడాది (2026) నుండి మరో మూడు సంవత్సరాల పాటు తలనీలాల టెండర్‌ను కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ వేలం నిర్వహించకుండా, నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా టెండర్ పత్రాలు రాసివ్వడంపై మైనారిటీ వర్గాలు మండిపడుతున్నాయి. కొందరు స్వార్థపరులైన అధికారుల మూలంగా వక్ఫ్ బోర్డు ప్రతిష్ఠ పూర్తిగా మసకబారుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే టెండర్ రద్దు చేయాలి: గ్రామస్తుల డిమాండ్

ఈ అక్రమ టెండర్ వ్యవహారంపై వరంగల్ జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్, సీఈఓ మరియు స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తక్షణమే స్పందించాలని ముస్లిం మైనారిటీ నాయకులు, అన్నారం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత రెండేళ్లుగా సదరు వ్యక్తి దర్గా నుండి మాయం చేసిన రూ. 60 లక్షల సొమ్మును రికవరీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన నూతన టెండర్‌ను రద్దు చేసి, వెంటనే పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.




# హర్ ఘర్ జల్ కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న తిమ్మాజి పల్లి గ్రామ సర్పంచ్ నాగేష్ యాదవ్, ఏ ఈ సందీప్ రెడ్డి**

వడ్డేపల్లి: జులై 25 ( విజన్ ఆంధ్ర పత్రిక) : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తిమ్మాజి పల్లె గ్రామం లో హర్ ఘర్ జల్ కార్యక్రమంలో తిమ్మజిపల్లి సర్పంచ్ నాగేష్ యాదవ్, ఏ ఈ. సందీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిమ్మాజి పల్లి గ్రామంలో నీటి ట్యాంకులు పరిశీలించడం, తాగునీటి సమస్య తెలుసుకోవడం, గ్రామంలో అందరికీ త్రాగునీరు అందే విధంగా చూడాలని ఏ ఈ సందీప్ రెడ్డి కోరడం జరిగింది. తిమ్మాజి పల్లి గ్రామ సర్పంచ్ నాగేష్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో నీటి సమస్య ఉన్నది వాస్తవమేనని దాన్ని అధిగమించడానికి కావాల్సిన చర్యల్లో భాగంగా బోర్ ప్రెస్ చేయించడం, కొత్త మోటర్ల ఏర్పాటు, బ్లాక్ అయిన పైపుల పునరుద్ధరణ పనులు చేపట్టిన తర్వాత అందరికీ త్రాగునీరు , గృహ అవసరాలకు సంబంధించిన నీళ్లు అందరికి కావాల్సినంత అందుతుందని ఏ ఈ గారికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఈ సందీప్ రెడ్డి , తిమ్మాజి పల్లి సర్పంచ్ నాగేష్ యాదవ్ ,సెక్రెటరీ ప్రతాప్ , గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

# చారకొండ మండలంలో వేగంగా కొనసాగుతున్న సర్ కార్యక్రమం



చారకొండ,జులై 25(విజన్ ఆంధ్ర)మండలంలో చేపట్టిన సర్ (ఎ×=) కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్ శ్రీమతి ఉమా క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటిస్తూ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మండల అధికారుల బృందంతో సమన్వయం చేస్తూ కార్యక్రమం సజావుగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు.
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుడు బలరాం గౌడ్, బీఆర్ఎస్ మండల నాయకుడు నేనావత్ సరిరాం నాయక్ పాల్గొని అధికారులతో కలిసి కార్యక్రమం విజయవంతానికి సహకరించారు. ప్రజలకు సర్ (ఎ×=)కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు అందించారు.
అధికారులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని,అవసరమైన వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. మండలవ్యాప్తంగా ఈ కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని తెలిపారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన విద్యాధికారి జయరాములు



పెబ్బేరు జులై 25 ( విజన్ ఆంధ్ర ) పెబ్బేరు మండల పరిధిలోని ఎంపీపీస్ పెబ్బేరు చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి ఎస్. జయరాములు ,ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.
ప్రార్థన సమయానికి హాజరు అయ్యి.. ప్రార్థనలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల ఆక్టివిటీస్ ని పరిశీలించారు.
ఈ సందర్భంగా ప్రధానంగా. ఎఫ్.ఎల్.ఎన్. (ఫౌండేషనల్ లీటరసీ అండ్ నూమెరేసి ) పరీక్షా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానం, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు.
అనంతరం నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించి, వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ తరగతులను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు.
మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజన నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలు మరియు ఇతర పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.
విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మండల విద్యాధికారి, ప్రతి విద్యార్థి ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి చిన్నరాములు గారు, ఉపాధ్యాయులు స్వాతి గారు,మాధురి గారు,రాధా గారు, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ కృష్ణవేణి గారు, పుష్పవతి గారు పాల్గొన్నారు.

# సీజెపి పోరాటానికి దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా**

**- యువతతో పెట్టుకుంటే ప్రభుత్వాలకు పతనం తప్పదు**



కొత్తకోట జులై 25 (విజన్ ఆంధ్ర): కొత్తకోట: విద్యార్థుల ఉద్యమం, యువత ఐక్యత ముందు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఇందుకు నిదర్శనమని బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ పేర్కొన్నారు.
గతంలో రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లే, విద్యార్థుల ఉద్యమం కూడా ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిందన్నారు. ప్రజాస్వామ్యంలో యువత స్వరం ఎంతో శక్తివంతమైనదని, యువతతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని అన్నారు.
ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమకారుడు అభిజీత్ దీప్కే చేసిన త్యాగాన్ని కొనియాడారు. విదేశాల్లో తన విద్య, కెరీర్‌ను పక్కనబెట్టి భారత రాజ్యాంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. అలాగే ప్రముఖ శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్ అందించిన మద్దతు ఉద్యమానికి మరింత బలం చేకూర్చిందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కరాటే నభి, ముంత మంజుల, రామకృష్ణ యాదవ్, నాయకులు జంగిర్, కురుమూర్తి యాదవ్, సంధ్య శ్రీను, ట్రాక్టర్ తిరుపతయ్య, రామచంద్రయ్య, నసీర్, షకీల్, విజయ్ ముదిరాజ్, నాగరాజు యాదవ్, నరేష్ గౌడ్, ఎల్ఐసీ తిరుపతయ్య, ఉమర్, రాము, జనార్దన్ గౌడ్, శేఖర్, సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

**...మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసుల ఆకస్మిక తనిఖీలు**

**నర్వ ఎస్సై పబ్బతి రమేష్**



మక్తల్, జులై 25 విజన్ ఆంధ్ర : నర్వ మండల కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని నర్వ ఎస్ఐ పబ్బతి రమేష్ తెలిపారు.
ఈ సందర్భంగా నర్వ మండల కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, ఎరువుల దుకాణాలు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.
ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ రవి, ఈగల్ ఫోర్స్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



## యాంటీ ర్యాగింగ్ గురించి అవగాహన కార్యక్రమం

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) జూలై 25 శనివారం : రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ గురించి అవగాహన కార్యక్రమం గీతాంజలి జూనియర్ కళాశాల, ఉయ్యాలవాడ నందు 25- 07-2026 నాడు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కాన్సిల్ హాజరై మాట్లాడుతూ..ర్యాగింగ్ అనేది కొత్తగా విద్యా సంస్థ లలో వచ్చిన విద్యార్థుల పైన సీనియర్ విద్యార్థులు అసభ్యంగా ప్రవర్తించడం, హింసించడం రూపంలో మనకు కనిపిస్తుంది అన్నారు. కాబట్టి ప్రతి విద్యార్థి తన తోటి విద్యార్థులను గాని, జూనియర్ విద్యార్థులతో గానీ స్నేహంగా మెలగాలి అన్నారు. అప్పుడే మనం ర్యాగింగ్ కు స్వస్తి పలికి స్నేహ భావంగా ఉంటాం అన్నారు. ఎవరైతే ర్యాగింగ్ కు పాల్పడుతారో వారిని చట్ట ప్రకారం శిక్షిస్తారు అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇతరులతో స్నేహంగా ఉండి రాగింగ్ రహిత సమాజాన్ని నెలకొల్పాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ మహా సంపర్క్ అభియాన్‌పై 45వ డివిజన్ లో బీజేపీ జిల్లా అధ్యక్షుల సమీక్షా సమావేశం..

నిజామాబాద్ జూలై25:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో సర్ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, ఈరోజు 45వ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ దినేష్ పటేల్ కులాచారి పోలింగ్ బూత్ అధ్యక్షులు మరియు డివిజన్ ముఖ్య నాయకులతో సర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ దినేష్ పటేల్ కులాచారి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ..సర్ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వంద శాతం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు.
అలాగే, ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా అత్యంత కీలకమైన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను.. ప్రతి ఒక్క ఓటరు నుండి సేకరించి కచ్చితంగా సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు (బీూా) సబ్మిట్ చేసేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ాదీజ మోర్చ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి వేణు గారు, సదానంద్, దొంతుల సురేష్ బొబ్బిలి రమేష్ పోలింగ్ బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా పాదయాత్ర

కుల్కచర్ల, జూలై, 25(విజన్ ఆంధ్ర): తొలి ఏకాదశి సందర్భంగా ప్రజలు తమ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కుల్కచర్ల మండలానికి చెందిన పలువురు భక్తులు కుల్కచర్ల చౌరస్తా నుంచి మైలారం వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కాలినడకన పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అనంతరం మైలారం వెంకటేశ్వర దేవాలయంలో స్వామిని దర్శించుని పూజలు జరిపించారు. పలువురు భక్తులు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి రోజున భక్తులందరం కలిసి కాలినడకన మైలారం వెంకటేశ్వర స్వామి దేవాలయంకు వెళ్లడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. భక్తి భావంతో మానసిక ప్రశాంతత పెంపొందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు అంజిలయ్య, నర్సింహ్మారెడ్డి, చందు, రాంరెడ్డి, భీంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య, మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాలనీవాసులు

గోపాల్ పేట జూలై 25 (విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలోని హనుమండ్ల గడ్డ కాలనీలో కాలనీవాసులు మానవత్వంతో స్పందించారు. ఇటీవలి కాలం లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన లక్ష్మి నారాయణ కుటుంబానికి అండగా నిలిచి రూ 52,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.
కాలనీకి చెందిన పూసల లక్ష్మీనారాయణ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న కాలనీవాసులు వెంటనే చందాలు వసూలు చేశారు. కాలనీ పెద్దలు, యువకులు కలిసి సేకరించిన మొత్తం రూ 52,000ను బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ కుటుంబం కష్టాల్లో ఉందని ఈ సమయంలో మేమందరం అండగా నిలబడాలని నిర్ణయించుకుని ఈ సాయం చేస్తున్నాం అని తెలిపారు. సాయం అందుకున్న కుటుంబ సభ్యులు కాలనీవాసులకు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల చొరవను స్థానికులు ప్రశంసించారు. ఇదే రోజు గ్రామ



సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ 5000 రూ, ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమం లో శరత్ బాబు, మాజీ ఉపసర్పంచ్ మైబూస్, మండ్ల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, టైలర్ వెంకటేష్, బోడోల్ల రాములు, మండ్ల శివుడు, కొంకలి రామస్వామి, గుండ్రాతి రాజేష్ గౌడ్,
కొంకలి వెంకట్రాములు ఉన్నారు. వీరితోపాటు పలువురు ఆర్థిక సహాయం చేశారు.

# 6వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ తన్నీరు రమేష్

బెల్లంపల్లి జులై 25 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపాలిటీ 6వ వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ శనివారం ఉదయం వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణితో కలిసి పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్ కాలువలను తక్షణమే శుభ్రం చేయాలని, డ్రైనేజీల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. అనంతరం వార్డులో చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ వర్షాకాలంలో



పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

# ముధోల్ డిగ్రీ కళాశాలకు బీ.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

ముధోల్:25జూలై:విజన్ ఆంధ్ర : నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ)గా ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు. శనివారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కు మర్యాదపూర్వకంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిశారు. దీంతో కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య, కోఆర్డినేటర్ డా. పవన్ పాండే, అధ్యాపకులు డా. సంజీవ్ కుమార్



లు మాట్లాడుతూ.. బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ అధ్యయన కేంద్రం ఏర్పాటుతో ముధోల్ పరిసర ప్రాంతాలు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ముధోల్ ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

టేక్మాల్ జులై 25 విజన్ ఆంధ్ర: మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో రాష్ట్ర విజిలెన్స్ బృందం ఎస్ పి సిహెచ్ శ్రుతి కీర్తి,ఏవో కోటేశ్వర్ మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, లైసెన్సులు, ధరల పట్టికలు, రైతులకు బిల్లుల జారీ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా,దుకాణదారులకు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఎరువులను నిర్ణీత ధరలకే రైతులకు విక్రయించాలని అధికారులు సూచించారు. అలాగే రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని అవగాహన కల్పించారు.
నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఎరువుల విక్రయదారులపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు మరియు సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ బృందం హెచ్చరించింది. అలాగే యూరియా యాప్ ద్వారా రైతులు ఎలా బుక్ చేసుకుంటున్నారు యాప్ వలన ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకోవడం జరిగింది గ్రౌండ్ బ్యాలెన్స్
మరియు ఈ పాస్ మెషిన్ లో నిల్వలు సరిగ్గా ఉన్నాయా లేదా అని చూడటం జరిగింది అలాగే ా ఫారం మరియూాజ లు ఎప్పటికప్పుడు సరిగ్గా చేర్చడం చేసుకోవాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు

## ఎంఆర్ పి కంటే అతిక ధరలకు యురియా అమ్మితే కఠిన చర్యలు



**- ఎరువుల డీలర్‌కు షోకాజ్ నోటీసులిచ్చిన ఏఒ పూజ**

**- హుస్నాబాద్‌లో వ్యవసాయ శాఖ చర్యలు**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర , జూలై 25 : రైతుల ఫిర్యాదుల మేరకు ఎంఆర్‌పీ  కంటే అధిక ధరకు యూరియా విక్రయించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ డీలర్‌కు హుస్నాబాద్ మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా

ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు--1985 ప్రకారం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించడం చట్టవిరుద్ధమని నోటీసులో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా వివరణ సమర్పించాలని, వివరణ సంతృప్తికరంగా లేకపోతే లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దు సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించిన రైతులు సంబంధిత ఆధారాలతో వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

**డ్రా లో ఎంపికైన వారికి వెంటనే ఇళ్లు ఇవ్వాలి:**
**- ఎంసీపీఐ(యూ)**




బెల్లంపల్లి, జూలై 25 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రా నిర్వహించి మూడు నెలలు గడిచినా, డ్రాలో ఎంపికైన అర్హులకు ఇప్పటికీ ఇళ్ల తాళాలు అందజేయకపోవడం బాధాకరమని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం సబ్  కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి, అర్హులకు త్వరలోనే ఇళ్లు అప్పగిస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదని విమర్శించారు. డ్రాలో ఎంపికైన లబ్ధిదారులు ఇళ్లు ఎప్పుడు అందుతాయో తెలియక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.  ఈ అంశాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ప్రజాప్రతినిధులను కలిసినా స్పందన రాలేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని డ్రాలో ఎంపికైన ప్రతి అర్హ లబ్ధిదారునికి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలు అందజేయాలని డిమాండ్ చేశారు.  లేదంటే లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో తోగరి రాహుల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు...

# మరిపెడ సబ్ స్టేషన్ లో బుర్హాన్ పురం గ్రామ రైతుల ఆందోళన..!

మరిపెడ , విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బుర్హాన్ పురం గ్రామంలో విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి గత రెండు సంవత్సరాలుగా లో-వోల్టేజ్, విద్యుత్ సరఫరా సరిగ్గా లేక యాసంగి పంటలు ఎండిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ (డిటిఆర్) మంజూరు కోసం విద్యుత్ శాఖాధికారుల సూచనల మేరకు ఎనిమిది మంది రైతులు డిడి లు కట్టి దాదాపు 40 రోజులకు పైగా గడిచినా, ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పోసిన వరి నార్లు నీళ్లు లేక ఎండిపోయి, భూమి నెర్రలు బారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అంతేకాకుండా, లైన్‌మన్, హెల్పర్ల నిర్లక్ష్యం వల్లే తరచూ లైన్లు తెగిపోతుండటంతో రైతులే స్వయంగా రిపేర్లు చేసుకోవాల్సి వస్తోందని, నిత్యం ఎల్సీ కోసం ఫోన్ చేసినా అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కించే క్రమంలో ఒక రైతు (బాణోత్ రవి నాయక్) చెయ్యి విరిగి రూ. 12,000 వరకు ఖర్చయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ లను ఏర్పాటు చేసి, ఎండిపోతున్న వరి నార్లను, ఇతర పంటలను కాపాడాలని గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చట్ట సభల్లోకి జెన్ జీ....

హైదరాబాద్:  అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమెదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన జెన్ జీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సింగపూర్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అయ్యే అవకాశం ఉందని, మన దేశంలోనూ ఆ అవకాశం జెన్ జీకి ఇవ్వాల్సి ఉందన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ చేసి ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని సీఎం తెలిపారు. నాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. అలాగే పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏళ్లకే తగ్గించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏళ్లకే ఓటు వేయగలుగుతున్నారని, 21 ఏళ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏళ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎంపిక కావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 1 శాతానికి లోపే జెన్ జీ ప్రాతినిధ్యం ఉందన్నారు. 30 శాతంగా ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కన్నా తక్కువ ప్రాతినిధ్యం ఉండడం సరికాదన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు, శాసనసభకు పంపించే బాధ్యత తాము తీసుకుంటామని... అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించగా.. తాము సిద్ధమని జెన్ జీ స్పందించింది.

జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వాళ్ల ప్రాతినిధ్యం ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభకు 25 ఏళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము డిమాండ్ చేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశం

ఏర్పాటు చేసి చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గింపు తీర్మానం పెట్టి ఆమోదిస్తామని సీఎం తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని సీఎం వెల్లడించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 21 ఏళ్ల వయస్సుకే శ్రీలక్ష్మి, 22 ఏళ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య, 22 ఏళ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి.ఆనంద్ ఐపీఎస్‌లుగా ఎంపికైన విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ కు ప్రదర్శనగా కాదని, రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి (సడక్ సే సంసద్) వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ గళం వినిపించడం ద్వారా యువతకు దేశాన్నిపాలించే అవకాశం ఇవ్వాలని శాసనసభలో తీర్మానం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యా శాఖ జెన్ జీ నేతకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సీఎం తెలిపారు. విద్యా శాఖ, ఐటీ శాఖ వంటి కీలకమైన శాఖలు.. 60, 70, 90 ఏళ్ల వాళ్లకు కాదు 21 వాళ్లకే ఇవ్వాలని, వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసని సీఎం అన్నారు.

జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని సీఎం స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాగలిగారని ప్రశంసించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదని సీఎం అన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై కేసులు సోమవారం లోపు ఎత్తివేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయి చైతన్య స్కూల్లో ఆకట్టుకున్న గ్రీన్ డే సెలబ్రేషన్స్

చేవెళ్ల, జూలై 25 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు గ్రీన్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహించినట్లు సాయి చైతన్య స్కూల్ కరస్పాండెంట్ నరసింహారెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని సాయి చైతన్య స్కూల్లో శనివారం గ్రీన్ డే సెలబ్రేషన్స్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, ప్రకృతి సంరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల ప్రాంగణాన్ని ఆకుపచ్చ బెలూన్లు, మొక్కలు, పర్యావరణ సందేశాలతో అందంగా అలంకరించారు. చిన్నారులు ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన పాటలు, పద్యాలు, సందేశాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరసింహారెడ్డి మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

నంగునూరు, జూలై 25 విజన్ ఆంధ్ర: ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందని ఎంపీడీవో లక్ష్మప్ప పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్, సిద్దన్నపేటలో సర్పంచులు పాకాల శ్రీనివాస్, సంగు పురేందర్ అధ్యక్షతన శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మప్ప మాట్లాడుతూ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద నీటిని నిల్వ చేసే పామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించుకునేందుకు తక్కువ నీటి వినియోగం ఉండే పంటలను సాగు చేయడంతో పాటు, నీటి వాడకాన్ని మరింత తగ్గించేందుకు బిందు, తుంపర సేద్యం పరికరాలు వాడి సాగునీటిని పొదుపు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు ఏపీఎం పంచాయతీ కార్యదర్శి అనిత, ఉపసర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, వార్డు సభ్యుడు కందికట్ల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పంగ రాజశేఖర రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బంగారి నర్సింలు పాల్గొన్నారు

# జన్నారంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**- ప్రధానిపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన**

**- పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు**



జన్నారం, జూలై 25 (విజన్ ఆంధ్ర) : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను శనివారం రోజున బిజెపి జన్నారం మండలశాఖ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండించి నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారిపై రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి స్థానిక పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నాయ కులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన నాయకుడు మన దేశ ప్రధాని న రేంద్ర మోడీని కాంగ్రెస్ నాయకులు కిం చపరిచేలా మాట్లాడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ప్రధాని పదవికి ఉన్న గౌరవాన్ని దిగజార్చేలా కాంగ్రెస్ నేతలు వ్యా ఖ్యానించడం అహంకార పూరితం అని తీవ్రంగా మండిపడ్డారు. దేశాభివృద్ధిని చూసి ఓర్వలేకే కాం గ్రెస్ నాయకులు ఇటువంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. వెంటనే కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసం హరించుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కు ర్యాలీగా వెళ్లి, బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రధాని వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన కాంగ్రెస్ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని కోరుతూ ఎస్ఐకి వినతిపత్రం అందజేశా రు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌ డ్ ,జగన్, దేవేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కొంతం శంకరయ్య,ఎస్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబ ర్ అజ్మీరా బద్రి నాయక్, మాజీ మండల అధ్యక్షు దు గోలి చందు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షు లు బెడద గోపాల్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షు లు బోడ తిరుపతి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షు లు పిట్ట రాజారావు, సర్పంచ్ లు వాసాల నరేష్, గోపాల్, సామల్ల లక్ష్మీరాజం, పోనకల్ ఉపస ర్పంచ్ అప్పాల జలపతి, బీజేవైఎం మండల అధ్య క్షులు కందుల రమేష్, రాగుల సూర్యం , జిల్లా నాయకు లు సంతోష్ కార్య కర్తలు తదితరులు పాల్గొన్నా రు.

# తొలి ఏకాదశికి బస్సులలో పోటెత్తిన భక్తులు

కాటారం డివిజన్ ప్రతినిధి, జూలై 25 (విజన్ ఆంధ్ర) : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు పుణ్యక్షేత్రాలను సందర్శించడంతోపాటు గంగా గోదావరి స్నానాలు ఆచరించడం ఆనవాయితీ. దీంతో శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ కేంద్రంలో బస్సులలో భక్తులు కిక్కిరిసిపోయారు. సమీపంలో గల కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవస్థానం తో పాటు త్రివేణి సంగమ స్థానంలో స్నానాలు ఆచరించడం భక్తుల యొక్క విశ్వాసం. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని కాటారం, మహా ముత్తారం, మలహర్, పలిమల, మహాదేవపూర్ మండలాలతో పాటు మంథని వరంగల్ పట్టణాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వెళ్లారు. బస్సులలో ప్రయాణించే ప్రయాణికులలో ఎక్కువగా మహిళలే కనిపించారు. మహాలక్ష్మి ఆర్టీసి ఉచిత బస్సు పథకం సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో భక్తి ప్రపత్తులతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేవస్థానాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వరంగల్, కరీంనగర్ వైపున గల పట్టణాల నుంచి వచ్చే భక్తులు కాటారంలో దిగి మరో బస్సులో కాళేశ్వరం కు చేరుకునే నేపథ్యంలో కాటారంలో భక్తులతో పాటు సాధారణ ప్రయాణికులతో పెద్ద ఎత్తున సందడిగా శనివారం కనిపించింది. బస్సులు కిక్కిరిసిపోవడంతో రోజువారి పనుల మీద వెళ్లే ఉద్యోగులకు కొంత మేరకు ఇబ్బందులు కలిగాయని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించి దైవ దర్శనాలు చేసుకుని తమ స్వస్థలాలకు సాయంత్రానికి తిరుగు ప్రయాణంలో సైతం బస్సులలో అదే మాదిరిగా రద్దీ ఉండడంతో ప్రయాణాలలో బస్సులు కిటకిటలు ఆడాయి.




# బీజేపీ జిల్లా నూతన పదాధికారుల సన్మానం

**- పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి**

**- ఎంపీ రఘునందన్ రావు**

నంగునూరు, జూలై 25 విజన్ ఆంధ్ర : అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు బీజేపీ సిద్దిపేట జిల్లా నూతన పదాధికారులకు సూచించారు. ఇటీవల సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ప్రకటించిన నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు(పదాధికారులు) మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును హైదరాబాద్ లోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని రఘునందన్ రావు సన్మానించారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జిల్లా పదాధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తే పార్టీకి మరింత ఆదరణ లభిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ రోజురోజుకు బలోపేతం అవుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత ప్రజాదరణ పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పదాధికారులు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీకి అంబాసిడర్‌లా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని పిలుపునిచ్చారు.

జిల్లా పదాధికారులు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విభీషణ్ రెడ్డి, ఖమ్మం వెంకటేశం, నత్తి మల్లేశం, ఉపాధ్యక్షులు తొడుపునూరి వెంకటేశం, సుభాష్ రెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్,బాల్ రెడ్డి, భాగ్యలక్ష్మి, కుమార్ గౌడ్, కార్యదర్శులు వాసరి యాదమల్లు, బాబు, వెంకట్ గౌడ్, సురేశ్, కార్యాలయ కార్యదర్శి గుండ్ల జనార్దన్, మీడియా కన్వీనర్ గోనె మార్కండేయులు, సోషల్ మీడియా ఇన్చార్జి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# "వస్తున్నాం వస్తున్నాం మల్లయ్య" నినాదాలతో మార్మోగిన నల్లమల

**"వస్తున్నాం వస్తున్నాం మల్లయ్య" నినాదాలతో మార్మోగిన నల్లమల**
**-సంవత్సరానికి ఒక్కరోజే దర్శనమిచ్చిన లొద్ది మల్లయ్య**
**-తొలి ఏకాదశి సందర్భంగా అడవుల్లోకి తరలిన వేలాది భక్తులు..**
**- ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకే అనుమతి...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 25 (విజన్ ఆంధ్ర): తొలి ఏకాదశి సందర్భంగా నల్లమల అడవుల్లో వెలసిన శ్రీ లొద్ది మల్లయ్య స్వామి ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే దర్శనం కల్పించే ఈ స్వామిని చూసేందుకు చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా ఇతర తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

"వస్తున్నా వస్తున్నాం మల్లయ్య"

అర్ధరాత్రి నుంచే భక్తులు అడవి బాట పట్టారు. బాణాల,మన్ననూరు నుండి కాలినడకన దట్టమైన అడవి గుండా సాగారు. నాలుగు కిలోమీటర్ల నడుస్తూ దారి పొడవునా ఆరు జలపాతాలతో అందమైన ప్రకృతి ఒడి, చుట్టూ పెద్ద పెద్ద గుట్ట రాళ్లు భక్తులకు కనువిందు చేశాయి. అడవిలోని గుట్టలన్నీ "వస్తున్నా వస్తున్నాం మల్లయ్య... పోతున్నాం పోతున్నాం మల్లయ్య" అనే నినాదాలతో మారుమోగాయి. బుగ్గలు పొడుచుకుని, మొక్కులు చెల్లించుకుని స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు.

స్వయంభు – తెలంగాణ అమర్నాథ్ – పాండవుల చరిత్ర

నల్లమల క్షేత్రంలో స్వయంభుగా వెలసిన లొద్ది మల్లన్న ను తెలంగాణ అమర్నాథ్ గా భక్తులు కొలుస్తారు. పురాణాల్లో ఈ లొద్ది మల్లన్న క్షేత్రాన్ని పాండవులు దర్శించినట్టు చరిత్ర చెబుతోంది. అందుకే ఈ క్షేత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.

ఒక్కరోజే అనుమతి – కారణం టైగర్ రిజర్వ్

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో లొద్ది మల్లయ్య ఆలయం ఉండటం వల్ల సంవత్సరానికి ఒక్కసారి తొలి ఏకాదశి రోజు మాత్రమే భక్తులకు అనుమతి ఇస్తారు. లొద్ది మల్లయ్య క్షేత్ర పరిసరాల్లో వన్యప్రాణుల సంతతి పెరగడం, జులై నెల జంతువుల పునరుత్పత్తి సమయంలో కావడంతో అటవీ అధికారులు గత కొన్నేళ్లుగా కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించారు. ఆ తర్వాత అందరినీ వెంటనే బయటకు పంపించారు. అటవీ ప్రాంతం కావడంతో ప్లాస్టిక్, మద్యం నిషేధించారు. లొద్ది మల్లయ్యను మొక్కుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. అందుకే ఏడాది పొడవునా ఎదురుచూసి ఈ ఒక్కరోజు దర్శనానికి వస్తారు. రైతులు పంటలు బాగా పండాలని, ఉద్యోగాలు, పెళ్లిళ్లు కావాలని మొక్కులు చెల్లించుకున్నారు.

అటవీ శాఖ అధికారులు, పోలీసులు, గ్రామస్థులు కలిసి తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ కారణంగా దారి పొడవునా ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

---

## తాగుడుకు బానిసైన వ్యక్తి అనుమానాస్పద మృతి

**- కుళ్ళిపోయిన స్థితిలో మృత దేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు**
**- రాజగోపాలపేటలో ఘటన**
**.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

నంగునూరు, జూలై 25 విజన్ ఆంధ్ర నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామానికి చెందిన మహమ్మద్ జహంగీర్ (50)అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్ళి పోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జహంగీర్ కు సుమారు 30 సంవత్సరాల కిందట వివాహం అయ్యింది. 20 సంవత్సరాలుగా మద్యానికి బానిస కావడంతో అతని భార్య హైదరాబాద్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతను తన తల్లి ఫరీదాబేగంతో కలిసి గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన జహంగీర్ తన తల్లితో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన కుమార్తె ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు జాంగిర్ ఇంట్లో మృతదేహంగా పడి ఉండటాన్ని గుర్తించారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది.

తన కుమారుడు మద్యానికి బానిసై మృతి చెందాడని అతని మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని తల్లి మహమ్మద్ ఫరీదా బేగం(70) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు రాజగోపాల పేట పోలీసులు తెలిపారు.

## ఘనంగా ఏకాదశి వేడుకలు...

బోధన్, జూలై 25(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలో ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. శనివారం ఆశాడి పాండురంగ ఏకాదశి పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రుక్మిణి పాండురంగడుకి కాకడ హారతి ప్రత్యేక హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో 15 వార్డ్ కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి, బోధన్ వీడీసీ కార్యవర్గ సభ్యులు బోదు శేఖర్, భక్తులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి రాములు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ తరలింపును బిఆర్ఎస్ వ్యతిరేకిస్తూ నిరసన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 25 : స్వయంగాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా స్కూల్ తరలించే కుట్రను వ్యతిరేకిస్తూ నేడు బి ఆర్ ఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు.సమావేశంలోనాయకులు మాట్లాడుతూ, వేలాది మంది పేద విద్యార్థుల కల ఇది. కానీ కాంగ్రెస్ నాయకుల కక్షతో దీన్ని ఇతర ప్రాంతానికి తరలించాలని చూస్తోంది" అని మండిపడ్డారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. అఖిల పక్షం పేరుతో కాలయాపన చేస్తున్నారు అని ఆరోపించారు రాబోయే.రోజుల్లో వారి వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతాం అని అన్నారు భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకులను ఊర్లలో తిరుగనివ్వం అని హెచ్చరించారు. అఖిలపక్షం వద్దు స్వపక్షం ముద్దు అనే నినాదం తో ముందుకువెళ్ళానున్నాముఅనిఅన్నారు.ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన స్కూల్ ను తరలించడం అంటేప్రజలమనోభావాలను దెబ్బతీయడమేనని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం



చేశారు. స్కూల్ ను ప్రకటించిన ప్రదేశంలోనే నిర్మించే వరకు ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని తీర్మానించారు. సమావేశ అనంతరం వెంకట చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు ఉప సర్పంచ్లు నాయకులు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు..

## NEET వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**- "యువత భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకున్నాను"..**
**- ప్రధానికి లేఖ పంపిన కేంద్ర మంత్రి...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 25 (విజన్ ఆంధ్ర) న్యూఢిల్లీ: NEET-UG పరీక్షలో తలెత్తిన అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యారంగానికి సేవ చేస్తున్నానని, బలమైన విద్యా వ్యవస్థే దేశానికి పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని లేఖలో పేర్కొన్నారు. దేశ యువత ఆకాంక్షలను, వారి న్యాయమైన అంచనాలను తాను ఎంతో గౌరవిస్తానని, భారత యువత కలలను సాకారం చేయడం తమందరి నైతిక బాధ్యత అని అన్నారు.

మే 3, 2026 న జరిగిన నీటుజుటు-ఖ+ పరీక్షల్లో అక్రమాలు వెలుగు చూడడంతో వెంటనే దాన్ని సీబీఐకి అప్పగించి, పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. 20 లక్షలకు పైగా విద్యార్థుల పరీక్షను ఎలాంటి ఇబ్బంది లేకుండా జూన్ 21, 2026 న విజయవంతంగా పూర్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యంగా ఉందని, ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం అందరూ సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జూలై 16న ప్రకటించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, పేద కుటుంబాల నుంచి వచ్చిన అనేక మంది విద్యార్థులు కూడా విజయం సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంలో మొదటి రోజు నుంచే తాను బాధ్యత వహించానని, పరీక్ష మాఫియా కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడి భవిష్యత్తు కూడా నాశనం కాకూడదనే సంకల్పంతో పనిచేశానని స్పష్టం చేశారు. అయితే గత 10 రోజులుగా జరుగుతున్న పరిణామాలు తన మనసును తీవ్రంగా బాధించాయని అన్నారు. జంతర్ మంతర్ వద్ద మరియు దేశంలో నెలకొన్న పరిస్థితులను కొన్ని దేశ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, అలాగే ఒక్క విద్యార్థి కూడా చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకోకూడదని భావించి ప్రధాని నరేంద్ర మోదీకి తన రాజీనామాను సమర్పించినట్లు తెలిపారు.

"భారత యువశక్తే ఈ దేశానికి అసలు బలం. యువత భ్రమల వలయంలో చిక్కుకోకుండా చూస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారు కేవలం భారత భవిష్యత్తు మాత్రమే కాదు, అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించే శిల్పులు" అని లేఖలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ మార్గదర్శకత్వం, సహచర మంత్రులు, మంత్రిత్వ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, దేశ సేవ తన జీవితంలో అత్యున్నత ప్రాధాన్యత అని, భవిష్యత్తులో కూడా భారత్ మాతకు, ఒడిశా ప్రజలకు మరియు దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు.